



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



2

- అమరావతిలో దేశంలోనే మొదటి పూర్తిస్థాయి క్వాంటమ్ టెక్ హబ్ ఏర్పాటు. ఇక్కడ క్వాంటమ్ ప్రాసెసర్‌ల తయారీ జరుగుతుంది.
- క్వాంటం కంప్యూటింగ్ మరియు కృత్రిమ మేధస్సు రంగాల్లో ఆంధ్రాను గ్లోబల్ లీడర్‌గా నిలపడమే లక్ష్యం.
- ఫిబ్రవరి 2026లో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రాజెక్ట్ భవనాల నిర్మాణానికి భూమిపూజ జరిగింది.
- ఐబీఎం, ఎల్ అండ్ టీ, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌వంటి ప్రముఖ సంస్థలతో కలిసి క్వాంటమ్ సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది.
- ఈ ప్రాజెక్ట్ ద్వారా భారీగా సాంకేతిక ఉద్యోగాలు, క్వాంటమ్ కంప్యూటింగ్ శిక్షణ అవకాశాలు లభిస్తాయి.
- ఈ ప్రాజెక్ట్ ఏపీని ఐటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో కొత్త పుంతలు తొక్కిస్తుందని అంచనా.

ఏపీ రాజధాని అమరావతిలో క్వాంటమ్ ఏర్పాటు చిన్నచిన్న అడుగులు కాదని.. మహత్తర ముందడుగని మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు దూరదృష్టి ప్రతి రోజూ మమ్మల్ని ఆశ్చర్యపరుస్తోందన్నారు. ఐటీ దిగ్గజం ఐబీఎంకు విశాఖ స్వాగతం పలుకుతోందని హర్షం వ్యక్తం చేస్తూ.. లోకేశ్ ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టారు. ఐబీఎం కార్యకలాపాలు ప్రారంభమవుతున్న సంకేతాలతో విశాఖ నగరానికి ఐటీ పెట్టుబడులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. విశాఖ ఐటీ హబ్‌గా మరింత బలపడుతోందని ధీమా వ్యక్తం చేశారు.



## ఏపీకి క్వాంటమ్ వెలుగు

- అమరావతి వేదికగా సాకారమవుతున్న సాంకేతిక విప్లవం
- ఏప్రిల్ 14న 1ఎస్, 1క్యూ టెస్ట్ బెడ్స్‌ను ఆవిష్కరించనున్న సీఎం

ప్రపంచ క్వాంటమ్ డే పురస్కరించుకుని దేశ చరిత్రలో కీలక ఘట్టానికి ఆంధ్రప్రదేశ్ వేదిక కానుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో భాగంగా ఏప్రిల్ 14న ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్‌లో రెండు వేర్వేరు క్వాంటమ్ కంప్యూటర్ టెస్ట్ బెడ్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు.



### ఎప్పటికీ ఆమె గొంతు ప్రతిధ్వనిస్తుంది

- ఆశాభోంస్లే మరణంపట్ల సీఎం చంద్రబాబు సంతాపం

అమరావతి (చైతన్య రథం): ప్రముఖ గాయని ఆశా భోంస్లే మరణంపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎక్స్ పోస్టులో "ఒక దిగ్గజ, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన భారతీయ గాయనిగా, ఆమె సంగీత చరిత్రలోనే అత్యధికంగా పాటలు రికార్డ్ చేయబడిన కళాకారిణి. సంగీత పరిశ్రమకు ఆమె చేసిన అసాధారణమైన సేవలు ఏడు దశాబ్దాలకుపైగా విస్తరించి ఉన్నాయి. కాలాతీతమైన రాగాలతో తరతరాలను సుసంపన్నం చేశాయి. పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత అయిన ఆమె వారసత్వం భారతదేశ సంగీత వారసత్వంలో ఒక అంతర్భాగంగా నిలిచి, యుగయుగాలపాటు ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు మరియు అభిమానులకు నా హృదయపూర్వక సంతాపం" అని పేర్కొన్నారు.

### సంగీత ప్రపంచానికి తీరని లోటు: లోకేష్

ప్రఖ్యాత గాయని ఆశా భోంస్లే గొంతు మూగబోవడం సంగీత ప్రపంచానికి తీరని లోటని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. ఎక్స్ పోస్టులో "భారతీయ భాషల్లో 80 ఏళ్లపాటు తన సుమధుర స్వరంతో వీనుల విందైన పాటలు అందించిన లెజెండరీ సింగర్.. ఆశాజీ భౌతికంగా మనకు దూరమైనా.. పాట రూపంలో జీవించే ఉంటారు. మహా గాయని మృతిపట్ల నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు.

### సహకరించండి...



2

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసిన గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ చైర్మన్ పి దోర్జే గ్యాంబా. సాదరంగా ఆహ్వానించిన ముఖ్యమంత్రి.. వరద జలాలను సద్వినియోగం చేసుకుంటున్న తీరు, నదుల అనుసంధానంపై రూపొందించిన ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు.

### రాష్ట్రపతి వద్దకు..



రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ఆదివారం రాత్రికి ఢిల్లీ చేరుకున్నారు. నారా లోకేష్‌కు టీడీపీ ఎంపీలు ఘన స్వాగతం పలికారు. సోమవారం మధ్యాహ్నం ఎన్డీఏ ఎంపీలతో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మంత్రి నారా లోకేష్ బృందం కలవనుంది. అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తించి చట్టబద్ధత కల్పించే బిల్లుకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంత్రి నారా లోకేష్, ఎన్డీఏ ఎంపీలు కృతజ్ఞతలు తెలియచేస్తారు.

3


## విధ్వంసం నుంచి వినాశనం వరకు..
## జగన్ గొడ్డలి రాజకీయం

- ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదమిది
- నరుకుతాం.. చంపుతామంటున్నారు
- రాక్షస మూకను ప్రజలే అడ్డుకోవాలి
- ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపు



# క్వాంటమ్ వెలుగు

- **అమరావతి వేదికగా సాకారమవుతున్న సాంకేతిక విప్లవం**
- **క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీతో ఏపీనుంచి ఇక కొత్త శకం**
- **ఏప్రిల్ 14న 1ఎస్, 1క్యూ టెస్ట్ బెడ్స్‌ను ఆవిష్కరించనున్న సీఎం**




అమరావతి (చైతన్య రథం): ప్రపంచ క్వాంటమ్ డే పురస్కరించుకుని దేశ చరిత్రలో కీలక ఘట్టానికి ఆంధ్రప్రదేశ్ వేదిక కానుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలోభాగంగా ఏప్రిల్ 14న ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్‌లో రెండు వేర్వేరు క్వాంటమ్ కంప్యూటర్ టెస్ట్ బెడ్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. అమరావతి కేంద్రంగా ఆవిష్కృతమవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీతో సాంకేతిక శకంలో నూతన అధ్యాయానికి నాంది పడనుంది. గన్నవరంలోని మేధా టవర్స్‌తోపాటు రాజధానిలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటవుతున్న 1ఎస్, 1క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటమ్ టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. దీంతో దేశంలోనే క్వాంటమ్ టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. దేశీయంగా తయారైన ఈ క్వాంటమ్ రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీతో క్వాంటమ్ కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యం అమరావతి క్వాంటమ్ వ్యాలీకి దక్కనుంది. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ, ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటమ్ రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్‌లు క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండుచోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే ఈ మినీ క్వాంటమ్ కంప్యూటర్ టెస్ట్ బెడ్‌లు క్వాంటమ్ ఉపకరణాలను పరీక్షించేలా తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటమ్ కంప్యూటర్ ఉపకరణాలు తయారు చేసే కంపెనీలతోపాటు పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీని ఏర్పాటు చేశారు.

**స్వదేశీ టెక్నాలజీతో రిఫరెన్సు ఫెసిలిటీ**

అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఈ రెండు క్వాంటమ్ రిఫరెన్సు ఫెసిలిటీల్లోనూ పూర్తిగా స్వదేశంలో తయారైన ఉపకరణాలనే ఉపయోగించారు. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ 1క్యూ పేరిట క్వాంటమ్ కంప్యూటర్ టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేసింది. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో 1ఎస్ పేరిట సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో క్వాంటమ్ టెస్ట్ బెడ్‌ను నిర్మించారు. ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఏర్పాటులో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓలాంటి సంస్థలు సహకారం అందించాయి. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటైన ఈ టెస్ట్ బెడ్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటమ్ మిషన్ సహా, ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటమ్ రంగంలోని పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, క్వాంటమ్ ఇన్నోవేషన్ స్టార్టప్‌ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరు కానున్నారు. ఏపీలోని వివిధ యూనివర్సిటీలు, కాలేజీలనుంచి వర్చువల్‌గా దాదాపు 1.5 లక్షలమందికిపైగా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## సీఎం చంద్రబాబుతో దోర్జే గ్యాంబా భేటీ



అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ చైర్మన్ పి దోర్జే గ్యాంబా సీఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ, సమర్ధ నీటి నిర్వహణ చర్యలు గురించి దోర్జే గ్యాంబాకు ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలోని నదీపరీవాహక ప్రాంతాల్లో అవేర్ సంస్థ ద్వారా జల వనరుల వివరాలు రియల్ టైమ్‌లో నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

వరద జలాలను సద్వినియోగం చేసుకుంటున్న తీరును, నదుల అనుసంధానంపై రూపొందించిన ప్రణాళికల గురించి వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు సమస్యపై చర్చించారు. గత సీజన్లో పెద్దవాగు పొంగి కట్ట తెగడంతో రెండు రాష్ట్రాల్లోనూ వరదలు సంభవించాయని, ఈ కారణంగా ప్రజలు ఇబ్బంది పడిన విషయం సమావేశంలో చర్చకు వచ్చింది. పెద్దవాగు ప్రాజెక్టు కట్టను బలోపేతం చేయడానికి తెలంగాణ రాష్ట్రంతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు దోర్జే గ్యాంబాకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## శ్రీవారి దర్శనాల్లో రికార్డ్

- **2025-26లో 4.57 శాతం వృద్ధి**
- **హుండీ ఆదాయంలోనూ పెరుగుదల**





అమరావతి(చైతన్యరథం): తిరుపతి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 2025-26లో గణనీయంగా పెరిగింది. సాంకేతికతను అందిపుచ్చు కోవడం, పక్కా ప్రణాళికతో వ్యవహరించడం, సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వడం, దళారీ వ్యవస్థను కట్టడి చేయడంతో శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య, హుండీ ఆదాయం, ప్రసాదాల పంపిణీ ఇలా అన్ని విభాగా ల్లోనూ రికార్డు స్థాయి వృద్ధి నమోదైంది. 2023-24, 2024-25లో సగటున రోజుకు 70 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా.. 2025-26లో సంఖ్య రోజుకు 73 వేలకు చేరి 4.57 శాతం వృద్ధి నమోదైంది. గతేడాది జూన్‌లో శనివారాల్లో సగటున 90-95 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పది రోజుల్లో అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే అదనంగా లక్షా 40 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. ఇక సాధారణంగా తిరుమల లో రద్దీ ఎక్కువగా ఉండే జూలై, ఆగస్టు నెలల్లో మాత్రమే స్వామివారి హుండీ ఆదాయం రూ.120 కోట్లు దాటుతుంది. కానీ, 3025-26 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా ఆరు నెలల పాటు హుండీ ఆదాయం.... ప్రతి నెలా రూ.120 కోట్లకు పైగా నమోదు కావడం విశేషం. మొత్తంగా ఆ ఏడాదిలో హుండీ ఆదాయం రూ.1420 కోట్లు దాటింది. ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షిస్తూ.. క్యూలైన్లలో భక్తుల రద్దీ. కంపార్ట్‌మెంట్ల వెయిటింగ్ సమయాన్ని బట్టి ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుని ఎక్కువ మందికి స్వామివారి దర్శనం జరిగేలా చర్యలు తీసుకున్నారు. స్వామివారి కైంకర్యాలకు, బ్రేక్ దర్శనాలకు ఎక్కడా ఆలస్యం లేకుండా సమయాన్ని పక్కాగా వినియోగించుకోవడంతో భక్తులకు మెరుగైన, వేగవంతమైన దర్శన భాగ్యం కలుగుతోంది. పెరిగిన భక్తులకు అనుగుణంగా కార్మికులతో పారిశుద్ధ్య నిర్వహణను అధికారులు మెరుగుపరి చారు.

చైతన్యరథం

## వినాశనం నుంచి విధ్వంసం వరకు

# జగన్ గొడ్డలి రాజకీయం

- ఆయనది ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదం
- నిస్సిగ్గుగా నరుకుతాం.. చంపేస్తామంటున్నారు
- బాబాయ్‌కే గొడ్డలి వేటు వేసిన చరిత్ర వారిది
- తల్లిని, చెల్లిని గెంటేసి నయవంచన చేశారు
- రంగాను అవమానించిన గౌతమ్‌రెడ్డికి పదవులు
- హంతకులను అక్కున చేర్చుకున్న చరిత్ర మీది
- ఆయన పేరు ఎత్తడానికి జగన్‌రెడ్డికి సిగ్గుండాలి.
- అధికారం కోసం ఎంతటి దారుణానికైనా ఒడిగడతారు
- యువత భవిష్యత్తును నాశనం చేయడమే వారి నైజం
- ప్రజాస్వామ్యం సిగ్గుతో తలదించుకుంటోంది
- హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు
- వివేకా కేసులో సాక్షులను మాయం చేస్తున్నారు
- ప్రజలంతా అప్రమత్తం.. రాక్షస మూకను అడ్డుకోవాలి
- ఇరిగేషన్ మంత్రి నిమ్మల ధ్వజం





మంగళగిరి(చైతన్యరథం): రాష్ట్రంలో జగన్‌రెడ్డి రాజకీయాలు ఉగ్రవాదులను మించిన ఉన్మాదంతో సాగుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. నిస్సిగ్గుగా విధ్వంసకర విధానాలతో రాష్ట్రాన్ని నాశనం చేయడమే లక్ష్యంగా వైసీపీ పని చేస్తోందని విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి తన హిడెన్ అజెండాను ఇప్పుడు బహిరంగంగానే ప్రజలకు చెబుతున్నారు. "చంపేస్తాం, నరికేస్తాం, అంతుచూస్తాం" అనే నీచమైన భాష ను వాడుతూ రాజకీయాలు చేయడం వైసీపీకి అలవాటుగా మారింది. అధికారం కోసం ఎంతటి దారుణానికైనా ఒడిగట్టేలా వారి తీరు ఉందని మండిపడ్డారు. ప్రజలకు మేలు చేస్తామని చెప్పాల్సిం ది పోయి.. మేము వస్తే ఉన్నవి పడగొడతాం, పనులు ఆపేస్తాం, యువతను చెడగొడతాం, మాదక ద్రవ్యాలు అమ్మిస్తాం అంటూ నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కనీసం బంధుప్రీతి కూడా లేకుండా రాజకీయాలకు అడ్డు వస్తే సొంత బాబాయ్‌నైనా గొడ్డలిపోటుతో అంతం చేస్తామనే భయంకరమైన సందేశాన్ని వీరు ప్రజల్లోకి పంపుతున్నారు. "నా తల్లి, నా చెల్లి" అంటూనే వారిని ఏ రకంగా చూసుకున్నారో రాష్ట్రం మొత్తం చూసింది. ఇప్పుడు రాష్ట్రంలోని 50 శాతం ఉన్న మహిళలకు అంతకంటే ఎక్కువ చేస్తాననడం వారిని వంచించడమే. అలాగే వైసీపీ 'యూత్ పాలసీ' అంటే మద్యం వ్యాపారాలు చేయడం, కొత్త కొత్త మాదక ద్రవ్యాల ను అందుబాటులోకి తెచ్చి యువత భవిష్యత్తును నాశనం చేయ డమేనా? అని మంత్రి ప్రశ్నించారు.

### వైసీపీ గొడ్డలి పార్టీగా మారిపోయింది.

ఏ పార్టీ అయినా శాంతిభద్రతలు కాపాడతామని చెబుతుంది. కానీ వైసీపీ మాత్రం 'గొడ్డలి పార్టీ'గా మారిపోయింది. 2029లో పొట్టేళ్లను నరికినట్లు తలలు నరికేస్తాం అని బహిరంగంగా గొడ్డళ్ల తో రోడ్ల మీద తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. జంతువులను నరికి ఆ రక్తాన్ని ఫ్లెక్సీల మీద చిమ్ము తూ రాక్షసానందం పొందే నాయకులు ప్రజలకు ఏం మేలు చేస్తారని నిలదీశారు. వైసీపీ నాయకుల భాష, వారి ఆలోచనా విధానం చూస్తుంటే ప్రజాస్వామ్యం సిగ్గుతో తలదించుకుంటోందని మంత్రి మండిపడ్డారు. ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన నాయకులే బాహాటంగా హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తా రు. వైసీపీ నాయకులు ఎంతటి తెగింపుతో మాట్లాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారు. "గుంటూరు ఇవతల ఇంటిలో నుంచి బయటకు లాగి కొడతాం.. గుంటూరు అవతల ఇంటిలోకి వెళ్లి నరుకుతాం" అని బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. వీరికి అధికా రం కావాల్సింది అభివృద్ధి కోసం కాదు, సంక్షేమం కోసం కాదు.. కేవలం తల్లులకు పుత్రశోకం మిగిల్చడానికి, భార్యలకు మాంగల్య దూరం చేయడానికే వీరు అధికార దాహంతో రగిలిపోతున్నారని మండిపడ్డారు.

### రాష్ట్ర భవిష్యత్తును స్మశాన వాటికలా మార్చడమే లక్ష్యమా?

రేపటి రాష్ట్ర భవిష్యత్తును ఒక స్మశాన వాటికలా మార్చడమే వైసీపీ లక్ష్యమా? అని ప్రశ్నించారు. నిజాలను నిర్భయంగా వెల్లడిస్తున్న ఏబీఎన్ మీడియా సంస్థపై, వారి ప్రతినిధులపై జగన్ రెడ్డి, ఆ పార్టీ నేతలు ఉన్మాదంతో మాట్లాడుతున్నారు. "నాలుకలు కోస్తాం.. అంతం చేస్తాం.. కొత్త పలుకు వినిపించకుండా చేస్తాం" అని ఒక మీడియా సంస్థను బెదిరించడం అంటే, అది సాక్షాత్తూ రాజ్యాంగం కల్పించిన ఫోర్త్ ఎస్టేట్ గొంతు నొక్కడమే. ఇలాంటి మాటలు ప్రజల్లో తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్నాయి. 151 సీట్లు ఉన్న పార్టీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారంటే, జగన్ రెడ్డి పరిపాలనపై ఎంతటి వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవాలి. కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితిలో ఉన్నా, జగన్ రెడ్డికి బుద్ధి రాలేదు. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోకుం డా మరింత రెచ్చిపోయి ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారు. నాడు తండ్రి పదవిని అడ్డం పెట్టుకుని లక్ష కోట్ల రూపాయలు దోచుకున్న 'ఆర్థిక ఉగ్రవాది' జగన్‌రెడ్డి, నేడు 'రాజకీయ ఉగ్రవాది'గా మారి పోయారు. వైసీపీ జెండాను పక్కన పెట్టి 'గొడ్డలి'ని జెండాగా చేసు కున్నారు. రక్త చరిత్రనే తన రాజనీతిగా భావిస్తున్న జగన్‌రెడ్డి, వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా మార్చేశారని ధ్వజమెత్తారు.

### సాక్షులను మాయం చేస్తున్నారు

కడప జిల్లాలో వివాదరహితుడిగా పేరున్న వివేకానందరెడ్డిని జగన్ తన రాజకీయ భవిష్యత్తు కోసం వాడుకున్న మాట వాస్తవం కాదా? ఆయన ఎంపీగా ఉన్నప్పుడు భయపెట్టి బలవంతంగా రాజీనామా చేయించిన లెటర్ పంపిస్తే.. నాడు సోనియాగాంధీ మందలించిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు.

వివేకా నందరెడ్డి గొడ్డలిపోటుతో హత్యకు గురైతే దాన్ని 'గుండెపోటు' అని సాక్షి పేపర్, ఛానళ్లలో ఎందుకు ప్రచారం చేశారు? సొంత చిన్నాన్న చనిపోతే గంటలో రావాల్సిన వ్యక్తి, 12 గంటలు ఆలస్యంగా వచ్చి సాక్ష్యాలు చెరిపేయడంలో నిమగ్నమవ్వడం దేనికి సంకేతం? ప్రపంచ చరిత్రలో ఎక్కడైనా చనిపోయిన వ్యక్తికి కుట్లు వేసి, డ్రెస్సింగ్ చేసి హత్యను కప్పిపుచ్చే ప్రయత్నం ఎవరైనా చేస్తారా? అని నిలదీశారు.

పరిటాల రవి హత్య కేసు నుంచి బయటపడటానికి జగన్‌కు ఆరు నెలలు పట్టిందని మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి గతంలోనే చెప్పారు. ఆనాడు పరిటాల రవి కేసులో సాక్షులు ఎలాగైతే ఒక్కొక్కరుగా మాయమయ్యారో, నేడు వివేకా హత్య కేసులో కూడా సాక్షులను అదే రకంగా మాయం చేస్తున్నారని ఆరోపించారు. దీనికి జగన్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

### జగన్‌రెడ్డి వికృత మనస్తత్వానికి నిదర్శనం

వైఎస్ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించి ఆయన ఆచూకీ కూడా లభించని విషాద సమయంలో.. సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి కావాలని చూడటం జగన్‌రెడ్డి వికృత మనస్తత్వా నికి నిదర్శనం. ఆ రోజుల్లోనే విజయమ్మ స్వయంగా రోశయ్యకి ఫోన్ చేసి "జగన్ రాకను తండ్రి రాజశేఖర్‌రెడ్డే ఇష్టపడలేదు, మీరు చెప్పి అతన్ని బెంగళూరులోనే ఉండమనండి" అని వేడు కున్నారంటే జగన్ పద్ధతి ఎలాంటిదో ప్రజలు అర్థం చేసుకోవా లి. తండ్రి మరణానికి రిలయన్స్ సంస్థే కారణమని నాడు దాడులు చేయించి, నేడు అదే సంస్థకు జగన్ రెడ్డి రాజ్యసభ పదవులను ఎలా అప్పగించారు? కేవలం తన స్వార్థం కోసం ఎవరినైనా వాడుకుని, ఎవరితోనైనా చేతులు కలిపే నైజం జగన్ రెడ్డిది.హత్యలు చేయడం, సాక్ష్యాలను తారుమారు చేయడం, వ్యవస్థలను మేనేజ్ చేయడం ద్వారా రాజకీయాలు చేస్తున్న జగన్‌రెడ్డి వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

### రంగా హంతకులను అక్కున చేర్చుకున్న చరిత్ర మీది

వంగవీటి రంగా గురించి, కాపు సామాజికవర్గం గురించి కానీ మాట్లాడే కనీస నైతిక అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదని మంత్రి ఘాటుగా విమర్శించారు. రంగా హంతకులను అక్కున చేర్చుకున్న చరిత్ర జగన్‌రెడ్డిదని ధ్వజమెత్తారు. వంగవీటి రంగా గారి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తి కుమారుడు ఈరోజు ఏ పార్టీలో ఉన్నారో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి. రంగా గారిని పొట్టనబెట్టుకున్న కుటుంబానికి హైదరాబాద్‌లో కోట్లాది రూపాయల విలువైన భూమిని 'గిఫ్ట్'గా ఎందుకు ఇచ్చా రో ప్రజలకు వివరించాలి. హంతక కుటుంబాలతో చెట్టాపట్టా లేసుకుని తిరుగుతూ రంగా పేరు ఎత్తడానికి జగన్‌రెడ్డికి సిగ్గుండాలి. రంగా గారిని రౌడీ అని పిలుస్తూ, కాపుల మనోభావాలను దెబ్బతీసిన గౌతమ్ రెడ్డిని జగన్ ఎందుకు హక్కున చేర్చుకున్నారు? అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి 'ఫైబర్ గ్రిడ్ చైర్మన్' పదవి ఇచ్చి సత్కరించడం రంగా గారిపై జగన్ రెడ్డికి ఉన్న విద్వేషానికి నిదర్శనం కాదా? నాడు తండ్రి పదవిని అడ్డం పెట్టుకుని ఆర్థిక వ్యవస్థను కలుషితం చేసిన జగన్ రెడ్డి, పార్టీ పెట్టిన తర్వాత రాజకీయ వ్యవస్థను, అధికారంలోకి వచ్చాక పరిపాలనా వ్యవస్థను భ్రష్టు పట్టించారు. అధికారులను, రాజకీయ నాయకులను సైతం తన నేర స్వభావంతో కలుషితం చేసిన వ్యక్తికి రాజకీయాల్లో ఉండే అర్హతే లేదు. 2014లో జరిగిన రాష్ట్ర విభజన కంటే, 2019–24 మధ్య జరిగిన వైసీపీ ఐదేళ్ల పాలన వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. ఆ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్, కేంద్రంలోని ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ పట్టాలెక్కిస్తున్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతుంటే మళ్లీ విధ్వంసం సృష్టించాలని జగన్ రెడ్డి ప్లాన్ చేస్తున్నారు. గొడ్డలిని జెండాగా, వినాశనాన్ని అజెండాగా పెట్టుకున్న ఈ 'గొడ్డలి పార్టీ'కి రాజకీయ సమాధి కట్టాల్సిన సమయం ఆసన్నమైంది. ఇలాంటి ఉన్మాద పార్టీని రాష్ట్రంలో లేకుండా శాశ్వతంగా రద్దు చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ఈ రాక్షస పాలన పోకడలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

---

## రాష్ట్రంలో వడగాలుల హెచ్చరికలు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో సోమవారం 51 మండలాల్లో తీవ్ర వడగాలులు, 49 మండలాల్లో వడగాలులు, మంగళవారం 53 మండలాల్లో తీవ్రవడగాలులు, 57 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వడగాల్పులు, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైందుకు అవకాశం ఉందన్నారు. ఎండ తీవ్రత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండలో బయటకు వెళ్లేప్పుడు తలకి టోపి పెట్టుకోవాలని, తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు. అదే విధంగా కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలన్నారు. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

---

## మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు దుర్మార్గం

- ఆయనను వెంటనే అరెస్టు చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ధ్వజం





అమరావతి(చైతన్యరథం): ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తీవ్రంగా ఖండించారు. ఖర్గే చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమైనవని, సభ్య సమాజం వీటిని ఎన్నటికీ అంగీక రించదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో యుద్ధోన్మాదాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ఒక వర్గాన్ని పూర్తిస్థాయిలో నాశనం చేయాలని, చంపాలని ఖర్గే పిలుపునివ్వడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని విమర్శించారు. ఆర్.ఎస్.ఎస్, బీజేపీలను పాము లతో పోల్చడమే కాకుండా వాటిని ఏ విధంగా చంపుతారో అదే విధంగా వీరిని కూడా చంపాలని పిలుపునివ్వడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. వివాదాస్పద వ్యాఖ్యలపై మల్లికార్జున ఖర్గే బహిరంగ క్షమాపణ చెప్పాలని, అలాగే ఈ విషయంలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు తమ స్పందన తెలియ జేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులను చంపాలనే పిలుపును ముస్లిం సమాజానికి ఏ ఉద్దేశంతో ఇస్తున్నా రని ఆయన ప్రశ్నించారు. చట్ట పరిధిలో ఖర్గేపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే ఆయన్ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో ప్రత్యర్థులను శత్రువులుగా భావించి వారు చచ్చిపోవాలని కోరుకునే ఆలోచన ఉన్న ఖర్గే ప్రజాస్వామ్యంలో ఉండటానికి అనర్హుడని స్పష్టం చేశారు.

# గోదావరి పుష్కరాల పనులకు శ్రీకారం

**మహదేవుని సత్రంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన - పాల్గొన్న దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



రాజమండ్రి (చైతన్యరథం): గోదావరి పుష్కరాలు – 2027 దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలకు దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీకారం చుట్టారు. వచ్చే సంవత్సరం జూన్ 26 జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు నిర్వహణకు ప్రభుత్వం ముందస్తుగా ఏర్పాట్లు చేస్తోంది. పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరంలో పుష్కర పనులకు మంత్రి ఆనం శంకుస్థాపన చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో పుష్కర ఏర్పాట్లకు మొత్తం 18 కాటేజీల వద్ద రూ.23.65 కోట్లతో అభివృ ద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాజమహేంద్రవరంలో 6 దేవాలయ సముదాయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కోటిలింగాల పేటలో రూ.3 కోట్లతో పండరి మహాప్రభు సత్రం నిర్మాణం, రాము సత్యనారాయణ స్వామి దేవస్థానంలో రూ.కోటి తో ముఖ మండపం, రాజమహేంద్రి నాగేశ్వరాల ఆలయంలో రూ.70 లక్షలతో అన్నదాన భవనం, రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో రూ.55 లక్షలతో పుష్కర నిర్మాణం, రూ.2.80 కోట్లతో గోపాల స్వామి దేవాలయ సముదాయం అభివృద్ధి, చందా సత్రంలో కాటేజీలు, సౌకర్యాల కోసం రూ.1.5 కోట్లతో శంకు స్థాపన చేశారు. మొత్తంగా 6 పనులకు గాను రూ.9.55 కోట్లు అంచనాతో పనులకు శ్రీకారం చుట్టారు. ఈ శంకుస్థాపన కార్యక్ర మంలో టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి ఎంపీ పురందరేశ్వరి, రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కష్ట సుఖాలలో భాగస్వామిని అవుతా

**రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి - క్లస్టర్లు, బూత్ కమిటీలతో ఆత్మీయ సమావేశం**



రాయచోటి (చైతన్యరథం): పట్టణ టీడీపీ కార్యాలయంలో ఆదివారం మంత్రి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నియోజకవర్గ క్లస్టర్లు, యూనిట్, బూత్ కమిటీ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కుమ్ములాటలు వద్దు..కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. మన ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధిని గడప గడపకు తీసుకెళ్లేం దుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. పార్టీ సిద్ధాంతాలను, ప్రతిష్ఠను పెంపొందించేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కష్ట కాలంలో పార్టీ కోసం పనిచేసిన ప్రతిఒక్కరికి కూడా అన్యాయం జరగకుండా న్యాయం చేసే బాధ్యత నాదేనని భరోసా ఇచ్చారు. మన ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను, మన ప్రభుత్వంలో జరుగుతున్న మంచిని కూడా ప్రజలకు వివరించాలని సూచించారు.

# ఏం ఉద్ధరించాడని జగన్‌రెడ్డి పర్యటన

- కొత్త పోర్టులు రాకుండా జీవోలిచ్చింది వైఎస్
- వాటికి సమాధానం చెప్పాకే నెల్లూరు రావాలి
- 2014లో చంద్రబాబు ఆ జీవోలు రద్దు చేశారు
- కృష్ణపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్
- నిర్మాణానికి మార్గం సుగమం చేశారు
- మత్స్యకారుల ప్రయోజనాల్లో రాజీ లేదు
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): కృష్ణపట్నం పోర్టుకు 1996లో నేను మొదటిసారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు శంకు స్థాపన చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి తెలిపారు. వైఎస్ సీఎం అయ్యాక కృష్ణపట్నం పోర్టు నుంచి వాడరేవు వరకు ఎలాంటి పోర్టులు, హార్బర్‌లు నిర్మించ కూడదని 2008 అక్టోబర్ 8న జీవో ఎంఎస్ నెం 40 ఇచ్చారు. 2009లో దానికి అనుబంధంగా మరో జీఓ కూడా జారీ చేశారు. అప్పట్లో వైఎస్ ఇచ్చిన జీఓల కారణంగా రామాయపట్నం పోర్టుతో పాటు జువ్వలదిన్నె హార్బర్ కట్టే అవకాశం లేకుండా పోయిం దని వివరించారు. తండ్రి అధికారాన్ని అడ్డుబెట్టుకుని జగన్ రెడ్డి అదనపు ఆదాయాల కోసం కృష్ణపట్నం పోర్టు కేంద్రంగా ఆధిపత్యం చెలాయించారని మండిపడ్డారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో జువ్వలదిన్నె హార్బర్‌తో పాటు రామాయపట్నం పోర్టులో కదలిక వచ్చిందని తెలిపారు. కొడుకు అక్రమార్జన కోసం వైఎస్ ఇచ్చిన అడ్డగోలు జీఓలను చంద్రబాబు రద్దు చేసేశారు. జువ్వలదిన్నె పిషింగ్ హార్బన్‌ను సాధించింది తామేనని వివరించారు. కృష్ణపట్నం పోర్టుకు శ్రీకారం చుట్టింది..రామాయపట్నం పోర్టు ఏర్పాటుకు మార్గం సుగమం చేసిందీ తామేనని తెలిపారు. జగన్‌రెడ్డి ఏ మొఖం పెట్టుకుని ఈ నెల 15న జువ్వలదిన్నె వస్తున్నారని ప్రశ్నించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి వాడరేవు వరకు తీరంలో ఏ నిర్మాణం చేపట్టకుండా తండ్రి అధికారంతో జీఓ తెచ్చానని చెబుతారా అని ప్రశ్నించారు.

# ఏజెన్సీలో 108 సేవల్లో అద్భుత రికార్డ్

**- 171 మంది గర్భిణులకు సురక్షిత ప్రసవం**

**- సిబ్బంది అంకితభావానికి నిదర్శనం**




అమరావతి(చైతన్యరథం): గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందించడంలో '108' అంబులెన్స్ సేవలు సరికొత్త మైలు రాయిని చేరుకున్నాయి. రవాణా సౌకర్యాలు సరిగా లేని మారు మూల ఏజెన్సీ గ్రామాల్లో గడచిన 5 నెలల్లోనే 171 మంది గర్భిణులకు అంబులెన్స్‌లోనే అత్యంత క్షేమంగా ప్రసవాలు నిర్వహించి 108 సిబ్బంది ఒక రికార్డును సృష్టించారు. కొండలు, వాగులు దాటుకుంటూ ఆసుపత్రులకు వెళ్లడం కష్టమైన చోట 108 అంబులెన్స్ ఒక నడిచే ఆసుపత్రిలా మారి గర్భిణులకు అండ గా నిలుస్తోంది. పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతున్న తల్లులను గమనించి, ఆసుపత్రికి వెళ్లే లోపే పరిస్థితి తీవ్రమవడంతో, ఈఎం టీ సిబ్బంది తమ నైపుణ్యంతో సురక్షితంగా డెలివరీ పూర్తి చేశారు. సురక్షితంగా 171 మంది తల్లీబిడ్డలు గత ఐదు నెలల్లో జరిగిన ఈ 171 ప్రసవాల్లో తల్లీబిడ్డలు అందరూ క్షేమంగా ఉండటం విశేషం. వారిని మెరుగైన చికిత్స కోసం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రు లకు తరలిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 5 నెలల్లో 171 ప్రసవాలు సక్సెస్ చేయడం 108 సిబ్బంది అంకితభావానికి నిదర్శనం. రహ దారులు సరిగా లేని చోట కూడా పైలట్లు, ఈఎంటీలు సమయానికి చేరుకుని ప్రాణాలను కాపాడుతున్నారు. ప్రజల ప్రాణాలే లక్ష్యంగా ఈ సేవలు నిరంతరం కొనసాగుతాయి.

# జూలై నెల శ్రీవారి దర్శన కోటా విడుదల



తిరుమల(చైతన్యరథం): జూలై నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేసే శ్రీవారి వివిధ దర్శనాలు, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల( సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ)కు సంబంధించిన కోటాను ఏప్రిల్ 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించి న వారికి టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధిం చిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**23న అంగ ప్రదక్షిణ టోకెన్లు విడుదల**

అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.

**వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా**

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల**

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ttdevasthanams.ap. gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు.

# 16న తిరుపతిలో చాగంటి ధార్మికోపన్యాసం

తిరుపతి(చైతన్యరథం): టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధర్మప్రచార కార్యక్రమాలు భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేం దుకు నిరంతరం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఏప్రిల్ 16న గురువారం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో సాయంత్రం 5.30 గంటలకు ధార్మికోప న్యాసం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన "నిత్య జీవితంలో ధర్మాచరణం" అనే అంశంపై భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ధార్మిక ఉపన్యాసాన్ని ఆలకించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని టీటీడీ కోరింది.

# రేపు టీటీడీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి

తిరుపతి(చైతన్యరథం): అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవం మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటలకు తిరుపతి మహతి ఆడిటోరియంలో ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలు ఘటించి ఆయన ఆశయా లను స్మరించుకోనున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీలో పనిచేస్తు న్న అన్ని విభాగాల అధిపతులు, ఉద్యోగులు పాల్గొననున్నారు.

చైతన్యరథం

# యాగంటిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- 16 రూములు, డార్మిటరీలు, షాపుల నిర్మాణం
- నిత్యాన్నదాన సత్రం, లడ్డూపోటుకు భూమిపూజ
- ఆలయం ముందు క్యూలైన్ షెడ్డుకు చర్యలు
- పాల్గొన్న ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- గత ప్రభుత్వంలో నిధులకు లెక్కలేదని ధ్వజం



బనగానపల్లె (చైతన్యరథం): మండలంలో ప్రముఖ శైవ పుణ్య క్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయం పరిధిలో మౌలి క సదుపాయాల కల్పనలో భాగంగా రూ.5.08 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆలయానికి తరలివచ్చే భక్తుల సౌకర్యా ర్థం రూ.3.30 కోట్ల వ్యయంతో 16 రూములు, రెండు డార్మిటరీ లు, 8 షాపులు నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.1.25 కోట్లతో నిత్య అన్నదాన సత్రం, రూ.29 లక్షలతో లడ్డూ పోటు, రూ.24 లక్షలతో దేవస్థానం ప్రాంగణంలో క్యూలైన్ షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు యాగం టిలో రూ.5.08 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గత ప్రభుత్వంలో యాగంటి అభివృద్ధికి ఏం చేశారో ఒక్కసారి ప్రాజెక్టులు ఆలోచిం చాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో యాగంటిలో కొత్త కమిటీ నిధులను దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేస్తుందని తెలిపారు. గత ఏడాది కాలంలో 2025 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు స్వామి వారికి రూ.5.57 కోట్ల ఆదా యం వచ్చింది.. గత ప్రభుత్వంలో 2021 నుంచి 24 వరకు రూ.7 కోట్ల ఆదాయం వచ్చింది.. కానీ ఆ ఏడు కోట్ల సొమ్ముకు లెక్కాపత్రం లేదని అన్నారు. నేడు స్వామి వారి ఆదాయంతో మేం చేస్తున్న అభివృద్ధి కళ్ళ ముందు కనపడుతుందని తెలిపారు. స్వామి వారి ఆదాయం గత ప్రభుత్వంలో ఎక్కడికి పోయినట్లు.. భగవంతుడికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత నాటి పాలక మండలిపై ఉందని ప్రశ్నించారు. ఇప్పటికే సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశాం. అయితే వైసీపీ నేతలు పిటిషన్ వేయడం దుర్మార్గమని మండిపడ్డారు. యాగంటిలో జరుగుతున్న అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించా రు. త్వరలో ఈ అభివృద్ధి కార్యక్రమాలు అన్ని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని స్పష్టం చేశారు.

# డ్రగ్స్‌పై దండయాత్ర-2

- మత్తు పదార్థాలపై స్పెషల్ డ్రైవ్
- జగ్గయ్యపేటలో పోలీసుల తనిఖీలు



ఎన్టీఆర్ జిల్లా (చైతన్యరథం): జగ్గయ్యపేట నియోజకవర్గంలో మత్తు పదార్థాల నిర్మూలన ధ్యేయంగా పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో సంచలన విషయాలు వెలుగుచూశాయి. 'డ్రగ్స్‌పై దండ యాత్ర-2' కార్యక్రమంలో భాగంగా పోలీసులు తనిఖీలు నిర్వహిం చారు. జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలోని జగ్గయ్యపేట, చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ తనిఖీలు చేపట్టారు. అనుమానితులుగా గుర్తించిన 112 మందికి యూరిన్ టెస్టులు నిర్వహించగా, అందులో 30 మందికి పాజిటివ్ అని తేలింది. అంటే వీరు డ్రగ్స్ లేదా గంజాయి వంటి మత్తు పదార్థా లను వాడుతున్నట్లు నిర్ధారణ అయింది. 'డ్రగ్స్‌పై దండయాత్ర-2' కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, విజయవాడ రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ, జగ్గయ్యపేట సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

# భోంస్లే ఆత్మకు శాంతి చేకూరాలి






అమరావతి (చైతన్యరథం): ప్రముఖ గాయని ఆశా భోంస్లే మృతికి ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆశాజీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సుదీర్ఘకాలం హిందీతో పాటు మరాఠీ, తెలుగు, బెంగాలీ వంటి భాషల్లో సినీ గీతాలు ఆలపించిన మధుర గాయని ఆమె. పాశ్చాత్య సంగీత శైలి గీతాలను సైతం ఆలపించి ఒక తరం యువతను ఉర్రూతలూగించారు. దమ్ మారో దమ్, చురా లియా హై తుమ్నే, ఇన్ అంకోంకి మస్తీ, రాధా కైసే న జలే.. వంటి గీతాలతో సినీ, సంగీతాభిమానులను అలరించారు. తెలుగులో ఆశాజీ పాడిన గీతాలు తక్కువే అయినా హిందీ గీతాలతో తెలుగు రాష్ట్రాల్లో చిరపరిచితమే. ఆశా భోంస్లే కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

## 'అశ్వమేధం' సినిమాతో ప్రత్యేక అనుబంధం:నందమూరి బాలకృష్ణ



ప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే (92) తుది శ్వాస విడిచారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ సోకడంతో ఆమె ను ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చేర్పించగా ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆమె మృతిపై ప్రముఖ నటుడు, తెలుగు దేశం హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాళులు అర్పించారు. ఆశా భోంస్లే మృతిపై విచారం వ్యక్తం చేస్తున్నానని పేర్కొన్నారు. ఏడు దశాబ్దాల సంగీత ప్రయాణం ఆశా భోంస్లేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబసభ్యులకు, అభి మానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని తెలిపారు. అజరామర గాత్రంతో సంగీత ప్రియులను ఆశా భోంస్లే అలరిం చారని కీర్తించారు. అనేక భారతీయ భాషల్లో వేలాది వైవిధ్యభరిత గీతాలను ఆమె ఆలపించారని ప్రశంసించారు. అశ్వమేధం చిత్రం ద్వారా ఆశా భోంస్లేతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ఓపీ నయ్యర్, ఆర్డీ బర్మన్‌తో కలిసి అద్భుతమైన ఎవర్‌గ్రీన్ పాటలు ఇచ్చారని తెలిపారు. పద్మ విభూషణ్ సహా అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులు ఆమెకు దక్కాయని చెప్పారు. ఆశా భోంస్లే మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటని పేర్కొన్నారు.

## సంగీత ప్రపంచానికి తీరని లోటు: కందుల దుర్గేష్



ప్రముఖ గాయని ఆశా భోంస్లే మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటని మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. గాయనిగా ఆశా భోస్లే సుదీర్ఘ ప్రయాణం భారతీయ చలనచిత్ర చరిత్రలో చిరస్మర ణీయమని, ఆమె పాటలు తరతరాల సంగీత ప్రియులను అలరిస్తూనే ఉంటాయని కొనియాడారు. తన గాత్ర మాధుర్యంతో కోట్లాది మంది సంగీత అభిమానులను ఓలలాడించడమే కాకుం డా దేశ అత్యున్నత స్థాయి పురస్కారాలను సైతం అందుకున్న ఘనత దక్కుతుందని గుర్తుచేశారు. తెలుగులో పాడిన పాటలు తక్కువే అయినప్పటికీ ప్రతి పాట ఒక ఆణిముత్యమని, తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ఆమెకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొ న్నారు. "ఆశా భోస్లే గారి మరణం సంగీత ప్రపంచానికి పూడ్చలేని లోటు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

## సవాల్ చేసి.. చివరకు రాలేనంటూ..

# బట్టబయలైన అమరావతిపై వైసీపీ విషప్రచారం

- తెలుగుయువత ప్రతినిధికి సమాధానం చెప్పలేక
- తోకముడిచిన ఆ పార్టీ మహిళా నాయకురాలు
- ఆపై ఫేక్ వీడియో విడుదల..నెటిజన్ల నుంచి విమర్శలు
- తప్పుడు ప్రచారం మానుకోవాలంటూ హితవు





అమరావతి (చైతన్యరథం): ఈ నెల 10న ఓ టీవీ చానల్ డిబేట్‌లో అమరావతిపై విషప్రచారం చేసి సవాల్ చేసిన వైసీపీ మహిళా నాయకురాలు వాటిని నిరూపించుకోలేక తోకముడిచారు. ఆ టీవీ చానల్ ప్రతినిధి సాక్షిగా వైసీపీ అమరావతిపై చేస్తున్న విషప్రచారం బట్టబయలైంది. ఆ డిబేట్‌లో టీడీపీ ప్రతినిధిగా బండారు వంశీ కృష్ణ, వైసీపీ ప్రతినిధిగా మంచా నాగమల్లేశ్వరి, కాంగ్రెస్ నుంచి షేక్ బాజీ, విశ్లేషకులు చెవుల కృష్ణాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంలో వైసీపీ అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి అమరావతి అంశాన్ని ప్రస్తావిస్తూ అమరావతిలోకి బయట వ్యక్తులను రానివ్వడం లేదని, ఆ ప్రాంతంలో ఫొటోలు వీడియోలు నిషేధమని, అక్కడ అభివృద్ధి పనులు అస్సలు జరగడం లేదని ఆరోపించారు. తాను, తన పార్టీ నాయకులు అమరావతికి వచ్చి అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. వెంటనే టీవీ డిబేట్ మోడరేటర్ రాజు బండారు వంశీకృష్ణని సవాల్‌కు సిద్ధమా అని ప్రశ్నించారు. వంశీకృష్ణ స్పందిస్తూ ఆ ఆరోపణలు సత్యదూర మని అమరావతిలోనే నిరూపిస్తానని సవాల్‌ను స్వీకరించారు. సమయం, తేదీ చెప్పాలని వైసీపీ ప్రతినిధి అడగ్గా అది మీ ఛాయిస్ అని తెలుగుయువత అధికార ప్రతినిధి వంశీకృష్ణ సమాధాన మిచ్చారు. అయితే అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తాను వస్తానని చెప్పారు వైసీపీ అధికార ప్రతినిధి చెప్పగా.. అందుకు తాను రెడీగా ఉన్నానని ఫోన్ నెంబర్‌ను వంశీకృష్ణ ప్రకటించారు. డిబేట్ మోడరేటర్ రాజును కూడా అక్కడకి రావాలని దానికి నాగమల్లేశ్వరి అడగ్గా వస్తానని చెప్పారు.

### టీవీ ప్రతినిధి సాక్షిగా బట్టబయలు

మధ్యాహ్నం 3 గంటలకు తెలుగుయువత అధికార ప్రతినిధి బండారు వంశీకృష్ణ అమరావతి కేంద్రబిందువైన సీఆర్‌డీఏ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తన సామాజిక మాధ్యమాల ద్వారా తాను వైసీపీ అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి చేసిన ఆరోపణల సత్యదూరమని నిరూపించడానికి వచ్చానని.. ఆమె వస్తే అమరావతి అభివృద్ధిని సాక్ష్యాలతో నిరూపిస్తానని పేర్కొంటూ వీడియో పోస్ట్ చేశారు. సాయంత్రం 4 గంటలకు టీవీ డిబేట్ మోడరేటర్ రాజు సీఆర్‌డీఏ కార్యాలయానికి చేరుకుని నాగ మల్లేశ్వరికి ఫోన్ చేసి తాను వస్తున్నారో లేదో వాకబు చేశారు. ఆమె గంటన్నర సేపటి తరువాత వంశీకృష్ణకు ఫోన్ చేసి వర్షం పడుతున్న కారణంగా ఆలస్యంగా వస్తానని..మరో అరగంటలో వస్తానని చెప్పింది. సాయంత్రం 6:30 వరకూ వేచి చూసిన వంశీ కృష్ణ ఆమె రాకపోయేసరికి తిరిగి ఫోన్ చేసినా స్పందించలేదు. టీవీ ప్రతినిధి ఫోన్ చేసినా స్పందన లేదు. సాయంత్రం 7 గంటల వరకు అక్కడే ఉన్న వంశీకృష్ణ దగ్గరలో జరుగుతున్న కొన్ని అభివృ ద్ధి పనులను చిత్రీకరించి తన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

### అమరావతిపై విషం చిమ్మొద్దని హితవు

సవాల్ చేసిన నాగమల్లేశ్వరి రాకుండా తోకముడవడంతో వంశీకృష్ణ స్పందిస్తూ చంద్రబాబుపై అక్కసుతో దయచేసి అమరావ తిపై విషం చిమ్మొద్దని, అమరావతిపై దాడి అంటే ఆంధ్రప్రదేశ్ యువత భవితపై దాడి అని ఘాటుగా హితవు పలికారు. ఆమె రాకపోవడంతో 6 గంటల పాటు వేచి చూసి వంశీకృష్ణ అక్కడ నుంచి వెళ్లిపోయారు. అయితే అదేరోజు రాత్రి 8 గంటల తర్వాత నాగమల్లేశ్వరి తన సామాజిక మాధ్యమాల్లో అమరావతికి వచ్చిన ట్లుగా ఒక ఫేక్ వీడియో పోస్ట్ చేశారు. ఆ వీడియో చూసిన నెటిజన్లు అసలు అమరావతే రాకుండా తోక ముడిచి వచ్చినట్లుగా వీడియోలు పెట్టారని మండిపడ్డారు. ఈ సవాళ్ల పరంపర చూశాక అమరావతిపై వైసీపీ చేస్తున్నవి విషప్రచారాలుగా వారు బుద్ధి మార్చుకోవాలని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జోన్-1
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు
చైతన్యరథం




వైఎస్ జగన్ గురించి గతంలో బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలను గుర్తు చేస్తూ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌ను పార్లమెంట్ సభ్యు కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు, పార్టీ నాయకులు, ప్రజలతో కలిసి తిలకించారు. అదేవిధంగా గతంలో వారు జగన్ గురించి మాట్లాడుతూ చేసిన తీవ్ర ఆరోపణల వీడియోలను ప్రదర్శించారు. తదుపరి పత్రికా సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు చేస్తున్న ఊసరవెల్లి ఆరోపణలను ప్రజలు నమ్మరని, అందుకే మీ గురించి ప్రజలకు మరోసారి గుర్తు చేస్తున్నామని అన్నారు.

# మానవతా మూర్తి ముఖ్యమంత్రి చంద్రబాబు

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఎంపీ కలిశెట్టి కృతజ్ఞతలు



విజయనగరం (చైతన్యరథం): పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు ఈ రోజు రణస్థలం వారి క్యాంపు కార్యాలయంలో నాయకులు,కార్యకర్తల సమక్షంలో అనారోగ్యం చేత బాధపడి వైద్య ఖర్చులకు గాను ఎంపీ ద్వారా ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి అర్జీలు పెట్టిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన మొత్తం నగదు రూ.1002064/- సుమారు పది లక్షల రూపాయలను చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక భారం ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారి ఆరోగ్య భద్రతలో భాగంగా వైద్య ఖర్చుల కోసం కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి బాధిత కుటుంబాలకు చెక్కులు రూపంలో అందించే కార్యక్రమం అభినందనీయమన్నారు. చెక్కులను పేద ప్రజలకి సీఎం పంపించారని వారికి ఇవ్వగా లబ్ధిదారులు ఆనందభాష్పాలతో ముఖ్యమంత్రి, ఎంపీకి కృతజ్ఞతలు తెలియజేశారు. మింది ఆదినారాయణకు రూ.1,63,22, జరుగుల అన్నపూర్ణకు రూ. 1,25,795, కంబాపు అమ్మోరమ్మకు రూ. 1,57,820లు, నక్కిన లిఖిల్ కుమార్‌కు ,రూ. 25000లు, కొలగాన అన్నపూర్ణ, దేర్సాం, రణస్థలం మండలం రూ. 41,870లు, దన్నాన సురేష్‌కు రూ. 204695లు, బాడీ రేణుక, కొవ్వాడ మత్సలేశంకు రూ. 1,26,290లు, సోడా నియాన్స్‌కు రూ. 107839లు, రాయటి శ్రావణికి రూ. 49,529లు చెక్కుల రూపంలో అందజేశారు.



# చింతలపూడి అభివృద్ధికి సరికొత్త మాస్టర్‌ప్లాన్

చింతలపూడి (చైతన్యరథం): చింతలపూడి నగర పంచాయతీ మాస్టర్ ప్లాన్‌ను ప్రస్తుతం చోటు చేసుకున్న మార్పులతో నమోదు చేసి కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిం చాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మునిసిపల్ అధికారులకు సూచించారు. 30 ఏళ్ల క్రితం రూపొందించిన మాస్టర్ ప్లాన్ వల్ల ప్రస్తుతం ప్రజలకు సరైన ఇంటి ప్లాన్‌లు ఇవ్వలేకపోతున్నారు. క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి శనివారం ఎమ్మెల్యే మాస్టర్ ప్లాన్ పరిశీలించారు. పాత మాస్టర్ ప్లాన్‌లో పంచాయతీ విస్తీర్ణం 12 కిలోమీటర్ల పరిధి మాత్రమే ఉంది. ప్రస్తుతం ఈ విస్తీర్ణం 40 కిలోమీటర్ల పరిధికి విస్తరించింది. మేజర్ మునిసిపాలిటీల్లోను ఇంత విస్తీర్ణం లేదని అధికారులు చెబుతున్నారు. ఇండస్ట్రియల్ జోన్ అని చూపించిన స్థలాల్లో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం జోరుగా జరిగాయి. ఈమేరకు కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు సూచించారు. మరోవైపు నగర పంచాయతీలో పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకాలు లేవు. మునిసిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇన్‌చార్జ్‌లుగానే కొనసాగుతున్నారు. గతేడాది ఇక్కడ మునిసిపల్ శాఖ ఆరుగురు ఉద్యోగులను నియామకానికి అనుమతి ఇచ్చింది. అయితే పాత మాస్టర్ ప్లాన్ కారణంగా ఉద్యోగులను పూర్తి స్థాయిలో నియమించలేదని సమాచారం.

# మనసున్న మారాజు మన్యం కలెక్టర్

సీతానగరం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బొబ్బిలి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళుతున్నాడు. చినభోగిల సమీపంలో ఎండ తీవ్రతకు వాహనంపై నుంచి పడి గాయపడ్డాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న కలెక్టర్ ప్రభాకర రెడ్డి తన వాహనాన్ని ఆపి క్షతగాత్రుడి దగ్గరకు చేరుకున్నారు. పరిస్థితి గమనించి తన వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించి, ఆసుపత్రి సిబ్బందికి సమాచారం అందించారు. తలకు గాయాలు కావడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.



# వైద్యరంగంలో సమూల మార్పులు

## ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

విశాఖపట్టణం (చైతన్యరథం): తమ ప్రభుత్వం వైద్యరంగంలో సమూల మార్పులు తీసుకువస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వంతో పాటు వివిధ సంస్థలు ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఏపీలో ఆరోగ్యశాఖను మరింత పటిష్ఠం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఆదివారం విశాఖపట్నంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో డయగ్నోసిస్ సేవలు ప్రారంభించారు. గెయిల్ ఆర్థిక సహాయంతో రెడ్ క్రెస్ సొసైటీలో డయగ్నోసిస్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్ క్రెస్ సొసైటీ అనేక కార్యక్రమాలు చేస్తోందని వెల్లడించారు. గెయిల్ ఆర్థిక సహాయంతో విశాఖపట్నం రెడ్ క్రెస్ సొసైటీలో డయగ్నోసిస్ సేవలు ప్రారంభించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ఈ డయగ్నోసిస్ సేవలు ఉత్తరాంధ్రవాసులకు ఉపయోగపడతాయని వివరించారు. ఏపీలో తలసీమియా, సికిల్‌సెల్ ఎనిమియాతో బాధపడుతున్నవారు రెండు వేలకు పైగా ఉన్నారని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.



# మనసున్న అధికారికి ఆదివారం అడ్డు రాదు

బలిజిపేట (చైతన్యరథం): జిల్లాలో పేదలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా వలసలు నివారించేందుకు ప్రభుత్వం ఆదివారం కూడా విబీజీ రామ్ జీ పనులను నిర్వహిస్తోంది. మండలంలోని 24 గ్రామపంచాయతీలకు గాను 18 పంచాయతీల్లో 3,762 మంది ఉపాధి కూలీలు పనులకు హాజరయ్యారు. సాధారణ రోజుల్లో మండలంలో 24 గ్రామపంచాయతీల్లో 7 వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. వీరందరికీ ఫేషియల్ యాప్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నట్లు ఏడీవో కేశవరావు తెలిపారు.



చైతన్యరథం



# కాకినాడ జిల్లాకు మహర్దశ

## విజన్ యాక్షన్ ప్లాన్‌పై జిల్లా ప్రజాప్రతినిధులకు అభయమిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు

కాకినాడ (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో అమరావతిలో ప్రత్యేక భేటీ నిర్వహించారు. జిల్లాల వారీగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్షిస్తున్న సీఎం కాకినాడ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించారు. సమీక్షకు ఎమ్మెల్యేలు యనమల దివ్య, వరుపుల సత్యప్రభ జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీ, వనమాడి కొండబాబు, పిఠాపురం నియోజకవర్గం నుంచి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, పెదపూడి మండలం నుంచి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాజులూరు మండలం నుంచి మంత్రి సుబాష్, తాళ్లరేవు మండలం నుంచి దాట్ల బుచ్చిబాబు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, జిల్లా ఇన్చార్జి మంత్రి పి. నారాయణ, కలెక్టర్ హరేందిరప్రసాద్, ఎస్పీ బిందుమాధవ్ హాజరయ్యారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన సమావేశం రాత్రి 9 గంటల వరకు సాగింది. జిల్లాలో పలు నియోజకవర్గాల ప్రగతిని ప్రస్తావించారు. మిగతా ఎమ్మెల్యేలను పనితీరు మరింత మెరుగుపర్చుకోవాలని సీఎం ఆదేశించినట్లు తెలిసింది. నియోజకవర్గాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. ఇక నిధులు రావడమే తరువాయి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు పెదపూడి, కాజులూరు, తాళ్లరేవు మండలాలకు సంబంధించి ఒక్కోచోట పెద్ద ఎత్తున నిధులకోసం ఎమ్మెల్యేలు ప్రతిపాదనలను సీఎంకు అందించారు. జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో తయారు చేసిన ప్రతిపాదనలపై తొలుత సీఎంవోలో చర్చించారు. అవసరమైన వాటిని సీఎం ముందుకు తీసుకువెళ్లారు. కాకినాడ నగర నియోజకవర్గంలో మూడో వంతెనకు రూ.250 కోట్లు, ఉప్పుటేరు క్రీకులను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.120 కోట్లు, ఎంఎస్ఎన్ చారిటీస్ వద్ద మల్టీపర్పస్ స్టేడియానికి రూ.9.8 కోట్లు. కుంభాభిషేకం రేవు వద్ద ఫ్లోటింగ్ జెట్టికి రూ.78 కోట్లు, కాకినాడ నగరపాలక సంస్థ ఛాలెంజింగ్ ఫండ్ కింద రూ.1,500 కోట్లు, స్మార్టిసిటీ కార్పొరేషన్‌కు ఇవ్వాల్సిన రూ.194 కోట్లకు ప్రతిపాదనలు అందించారు. కాకినాడ గ్రామీణ నియోజకవర్గానికి సంబంధించి కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధికి రూ.5 కోట్లు, కీలకమైన సాల్ట్ భూముల్లో 1,245 ఎకరాలను వినియోగంలోకి తీసుకురావడం, ఎన్టీఆర్ బీచ్ అభివృద్ధికి రూ.4 కోట్లు, పండూరు చెరువు అభివృద్ధి. పార్కు ఏర్పాటుకు రూ.2.50 కోట్లు. భావన్నారాయణస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు చొప్పున ఇవ్వాలని ప్రతిపాదనలు ఇచ్చారు. పిఠాపురం, తుని, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు రూ. కోట్లలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు కోరారు. వీటన్నింటిపై సీఎం సానుకూలంగా స్పందించారు. వీటిలో 80 శాతం వరకు సాకారమవుతాయని ఎమ్మెల్యేలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. త్వరలో జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు మార్గం సుగమమవుతోంది.

# అన్నల అడ్డా నుంచి అభివృద్ధి అందలానికి..

## దండకారణ్యంలోని గుర్తేడుకు కాలినడకన కలెక్టర్ దినేష్‌కుమార్

వై.రామవరం (చైతన్యరథం): జిల్లాలో నూతనంగా ఏర్పాటైన గుర్తేడు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. శనివారం గుర్తేడు మండలంలో గల పాతకోట పంచాయతీలోని సింగనకోట గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ గ్రామానికి కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడంతో 15 కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లి గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అందుతున్న తాగునీరు, విద్యుత్తు సరఫరాపై ఆరా తీశారు. గ్రామస్థులు గృహాలు, భూమిపట్టాలు ఇప్పించాలని కలెక్టర్ని కోరారు. తాగునీరు ఏర్పాటు చేయాలని, రోడ్డు నిర్మించాలని, పింఛనులేని వారికి ఇప్పించాలని వినతులు ఇచ్చారు. మినీ అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని, విద్యావాలంటీరిని నియమించాలని కోరారు. గ్రామంలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. రైతులకు పండ్లమొక్కలు, జాబ్రా మొక్కలు' అందజేస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఆదివాసీలు వండిన భోజనాన్ని అందరితో కలిసి తిన్నారు. గ్రామసభ నిర్వహించి గ్రామానికి అవసరమైన వసతులపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ శ్రీనివాస్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాంగదయ్య, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రత్నాకరరావు, డీఎంహెచ్వో సరిత, డీఈ సుబ్బారావు, మండల ప్రత్యేక అధికారి దైవదానం, ఎంపీడీవో బాపన్నదొర, ఏపీవో స్వామి. ఏపీఎం ఆదినారాయణ పాల్గొన్నారు.



సింగరకోట గ్రామస్థులతో నేలపై కూర్చుని మాట్లాడుతున్న దినేష్ కుమార్



రాజమహేంద్రవరం కోటిలింగాల రేవు సమీపంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనకు సంబంధించి ఇటుకను పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

# అన్నవరం దేవస్థానంలో అభివృద్ధి పనుల జాతర

## పలు కార్యక్రమాలకు మంత్రి ఆనం రామనారాణరెడ్డి శ్రీకారం



అన్నవరం (చైతన్యరథం): అన్నవరం దేవస్థానంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆయన చేతుల మీదుగా శంకుస్థాపను ప్రారంభోత్సవం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. రూ.1.30 కోట్లతో రెండో మెట్లమార్గం ప్రారంభించిన ఆయన, రూ.11.40 కోట్లతో రత్నగిరిపై సీతారామ వసతి సముదాయం మొదటి దశ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జీ ప్లస్ 3 భవనంలో ఒక్కో అంతస్తులో 35 గదులతో 105 గదులు నిర్మిస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కియోస్కును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం, అన్నదానం, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. ఆలయాల్లో అందుతున్న సేవలపై భక్తుల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయం సేకరణ చేస్తున్నామన్నారు. 10.50 లక్షల కోట్లు అప్పులు బహుమానంగా జగన్ ఇచ్చి వెళ్లారని విమర్శించారు.

# పోలవరంలో పెద్దపులి కలకలం



ఏలూరు (చైతన్యరథం): జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలు కొత్తూరు, వాడపల్లి పరిసరాలలో పెద్దపులి సంచరిస్తోంది. ఆ పెద్దపులి అల్లూరి జిల్లా మాంటూరు నుంచి గోదావరి నది దాటి ఏలూరు జిల్లాలోకి తిరిగి ప్రవేశించింది. అటవీ శాఖ అధికారులు వీడియో ట్రాకర్ సాయంతో నిరంతరం పెద్దపులి కదలికలను పర్యవేక్షిస్తున్నారు. పెద్దపులి సంచారం నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రజలకు పలు హెచ్చరికలు జారీ చేశారు. ముందు జాగ్రత్తగా రాత్రి వేళల్లో ఒంటరిగా తిరగవద్దని హెచ్చరించారు.

**ఊపిరి పీల్చుకున్న మన్యం వాసులు..**

పెద్దపులి నది దాటటంతో రెండు వారాలుగా కంటి మీద కునుకులేకుండా అల్లాడిపోయిన మన్యం వాసులు ఊపిరి పీల్చుకున్నారు. మూడు రోజుల పాటు దేవీపట్నం, లింగవరం పరిసర ప్రాంతాల్లో పులి తిరిగింది. శనివారం ఉదయం దేవీపట్నం, అగ్రహారం పరిసర ప్రాంతాల్లో గోదావరిని దాటుకుని ఏలూరు జిల్లా పోలవరం మండలం సింగనపల్లికి చేరుకుంది. అది పోలవరం ప్రాజెక్ట్ ముంపు ప్రాంతం కావటంతో నిర్వాసితులు గ్రామాన్ని ఖాళీ చేసి పునరావాస కాలనీలకు వెళ్లిపోయారు.



# 14 నుంచి సముద్రంలో చేపల వేటకు లంగరు

## జూన్ 15 వరకు నిషేధ ఆజ్ఞలు, నోటీసులు జారీ చేస్తున్న మత్స్యశాఖ అధికారులు

నరసాపురం (చైతన్యరథం): తీరంలో సోమవారం అర్ధరాత్రి నుంచి సుముద్ర వేట నిషేధ ఆజ్ఞలు అమల్లోకి రానున్నాయి. జూన్ 15 వరకు అంటే 60 రోజుల పాటు ఈ ఉత్తర్వులు అమల్లో ఉండనున్నాయి. ఇప్పటికే కేంద్రం జారీ చేసిన ఈ ఉత్తర్వుల్ని మత్స్యశాఖ అధికారులు వేట సాగించే బోట్ల నిర్వాహకులకు అందిస్తున్నారు. నిషేధం అమల్లోకి వస్తే ప్రత్యక్షంగా పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడిన సుమారు 10 వేల మంది రెండు నెలల పాటు ఉపాధి కోల్పోనున్నారు. వీరిలో 1,830 మంది మత్స్యకారులు ఉన్నారు. మిగిలిన వారంతా ఐస్ ఫ్యాక్టరీ, మత్స్యసంపదను ఎగుమతి చేసే కంపెనీల్లో పనిచేసే కార్మికులు, లారీ డ్రైవర్లు ఉన్నారు. నెలకు సుమారు రూ.20 కోట్లు మత్స్య సంపద ఎగుమతులు నిలిచిపోనున్నాయి.

### 1,830 మంది మత్స్యకారులకు భృతి

నిషేధ కాలంలో ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులకు ప్రభుత్వం నెలకు రూ.10 వేలు చొప్పున రెండు నెలల కాలానికి

### రెండు నెలల పాటు మత్స్యకారులకు ఉపాధి దూరం

రూ.20 వేలు భృతి అందించనుంది. జిల్లాలో ప్రస్తుతం 1830 మంది గుర్తింపు పొందిన మత్స్యకారులు ఉన్నారు. మే, జూన్ నెలలో ఈ భృతి మొత్తం వారి ఖాతాల్లో జమ చేయ నున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు వరకు నిషేధ సమయంలో కేవలం రూ.10 వేలు మాత్రమే భృతి అందేది. గత రెండేళ్ల నుంచి పెంచిన మొత్తం రూ.20 వేలు అందిస్తున్నారు. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు కేంద్ర దేశవ్యాప్తంగా సముద్ర వేటను నిషేధిస్తూ వస్తుంది. ఈ రెండు నెలల కాలంలో సముద్రంలో మత్స్య సంపద పునరుత్పత్తి ఎక్కువగా జరుగుతుంటుంది. ఈ సమయంలో వేట సాగిస్తే మత్స్య సంపద హరించిపోతుందన్న జాగ్రత్తతో నిషేధం అమలు చేస్తారు. జిల్లాలో నరసాపురం, మొగల్తూరు మండలంలో సముద్ర తీరం విస్తరించి ఉన్న 19 కిలోమీటర్ల పరధిలోనూ ఈ నిషేధ అజ్ఞలు 14వ తేదీ నుంచి అమల్లోకి వస్తున్నాయి.

### తిరుగుముఖం పడుతున్న బోట్లు

నరసాపురం తీరం సముద్ర వేటకు పెట్టింది పేరు. గోదావరి, సముద్రం కలిసే ప్రదేశం కావడంతో ఏటా ఈ ప్రాంతంలో వేట సాగించేందుకు వందలాది బోట్లు వస్తుంటాయి. ఎక్కువగా కాకినాడ, మచిలీపట్నం ప్రాంతాలకు చెందిన బోట్లు ఈ ప్రాంతంలో వేట సాగిస్తుంటాయి. విదేశీ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న టైగర్ రొయ్య, పండుగొప్ప, మగ, సందువాయి. టోనా వంటి రకాలకు చెందిన చేపలు ఈ ప్రాంతంలో పుష్కలంగా దొరుకుతాయి. ఇలా వేటాడిన మత్స్య సంపదను కోనసీమ జిల్లా అంతర్వేది, నరసాపురం మండలం బియ్యపుతిప్ప, పట్టణంలోని లాకుల వద్ద నుంచి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం సీజన్ ముగిస్తుంటడంతో వేటకు వెళ్లిన బోట్లన్నీ తీరానికి చేరుకుంటున్నాయి.

# సంగీత ప్రపంచానికి ఆశా భోస్లే మృతి తీరని లోటు

## మంత్రి కొలుసు పార్థసారథి సంతాపం

నూజివీడు (చైతన్యరథం): ప్రపంచ ప్రఖ్యాత భారతీయ సినీ గాయకురాలు, అఖండ భరతావనిని తన గానంతో మెప్పించి, అలరించిన ఆశా భోస్లే గారి గొంతు మూగబోయిందన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మంత్రి కొలుసు పారసారథి విచారం వ్యక్తం చేశారు. ఆశా భోస్లే భౌతికంగా దూరమైనా....పాటరూపంలో ఎప్పుడూ బ్రతికే ఉంటారు. కళారంగంలో ఆమె అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆశా భోస్లే మృతికి తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. వారి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని కోరుకున్నారు. భోస్లే కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# జనగణన ప్రక్రియ ప్రారంభానికి సన్నాహాలు

## మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం



అమరావతి (చైతన్యరథం): దేశవ్యాప్తంగా 2027 జనగణన ప్రక్రియ ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జనగణన నిర్వహణకు సంబంధించిన ముఖ్యమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. దేశంలో జనగణనను దశలవారీగా నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు హౌస్‌లిస్టింగ్ ఌ హౌసింగ్ సెన్సస్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీనికి ముందు ప్రజలకు 15 రోజులపాటు సెల్ఫ్ ఎన్యూమరేషన్ సదుపాయం కల్పించనున్నారని సమాచారం. అలాగే మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో జరగబోయే 2027 జనగణన ప్రక్రియకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కూటమి ప్రభుత్వం కోరింది. 1948 జనగణన చట్టం ప్రకారం ప్రజల విధులు, బాధ్యతలను స్పష్టంగా తెలియజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 12న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జనగణన నిర్వహణ కోసం వచ్చే సిబ్బందికి ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని ప్రభుత్వం సూచించింది. నిబంధనల ప్రకారం జనగణన సిబ్బందికి ప్రశ్నలు అడిగే అధికారం ఉందని, వారు కోరిన సమాచారాన్ని సరైన విధంగా అందించాలని తెలిపింది. అలాగే, సెన్సస్ అధికారులు అడిగే ప్రశ్నలకు సరైన సమాచారాన్ని ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొంది. తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇంటి యజమానులు సెన్సస్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని, ఇళ్లకు వేసే గుర్తులు లేదా నంబర్లు తొలగించడం నేరమని స్పష్టం చేసింది. అలాగే సెన్సస్ ఫారమ్‌లను సరిగ్గా నింపడం కూడా ప్రజల బాధ్యతగా పేర్కొంది. సెన్సస్ చట్టం 1948 ప్రకారం నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించనున్నట్లు వెల్లడించింది. జనగణన అధికారులకు సహకరించని వారికి రూ.1000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని సందర్భాల్లో జైలు శిక్ష కూడా ఉండొచ్చని హెచ్చరించింది. అయితే, జనగణన కోసం సేకరించిన వ్యక్తిగత వివరాలను ఇతరులు పరిశీలించే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేసింది. జనగణన ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావాలంటే ప్రజల సహకారం అత్యంత కీలకమని ప్రభుత్వం పేర్కొంది.




# నిప్పులు చెరుగుతున్న భానుడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తాజాగా వడగాలులపై హెచ్చరికలు జారీ చేశారు. (రేపు) సోమవారం, (ఎల్లుండి) మంగళవారం రాష్ట్రంలోని పలు మండలాల్లో తీవ్ర వడగాలులు, సాధారణ వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉండగా, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

సోమవారం మొత్తం 51 మండలాల్లో తీవ్ర వడగాలులు, 49 మండలాల్లో సాధారణ వడగాలులు ప్రభావం చూపనున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. తీవ్ర వడగాలుల ప్రభావం శ్రీకాకుళం జిల్లాలో 9 మండలాలు, విజయనగరం జిల్లాలో 18 మండలాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక మండలం, పోలవరం ప్రాంతంలో 3 మండలాలు, అనకాపల్లి జిల్లాలో 3 మండలాలు, ఏలూరు జిల్లాలో 2 మండలాల్లో ఉండే అవకాశం ఉందని తెలిపారు. అలాగే సాధారణ వడగాలుల ప్రభావం శ్రీకాకుళం జిల్లాలో 2 మండలాలు, విజయనగరంలో 5, అల్లూరి జిల్లాలో 4, పోలవరం ప్రాంతంలో 9, అనకాపల్లి జిల్లాలో 5, కాకినాడ జిల్లాలో 5, తూర్పుగోదావరి జిల్లాలో 9, ఏలూరులో 4, ఎన్టీఆర్ జిల్లాలో 3, పల్నాడు జిల్లాలో 2, నంద్యాల జిల్లాలో ఒక మండలంలో వడగాలుల ప్రభావం ఉండవచ్చని అధికారులు తెలిపారు.

### తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదు..

ఏపీలోని పలు ప్రాంతాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. కడప జిల్లా పొట్టిపాడులో 43.8 డిగ్రీల సెల్సియస్, తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 43.1 డిగ్రీలు, నంద్యాల జిల్లాలో 42.9 డిగ్రీలు, అనంతపురం జిల్లా తెరన్నపల్లెలో 42.3 డిగ్రీలు, కర్నూలు జిల్లా గూడూరులో 42.1 డిగ్రీలు, పల్నాడు జిల్లా దుర్గిలో 41.8 డిగ్రీలు, శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నంలో 41.6 డిగ్రీలు, మార్కాపురం ప్రాంతం అనుమలపల్లి, నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 41.2 డిగ్రీలు, పశ్చిమగోదావరి జిల్లా పోడూరులో 41.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు తగ్గించాలని కోరారు.

ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ఈ జాగ్రత్తలు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ లేదా రుమాలు ధరించాలి. లేత రంగులో ఉండే కాటన్ వస్త్రాలను ధరించడం ఉత్తమం. కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ వాడాలి. వేడి గాలి నేరుగా చెవుల్లోకి వెళ్లకుండా కప్పుకోవాలి. అలాగే గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

### ఆరోగ్యం, ఆహారం

శరీరం డీహైడ్రేషన్ (నీటి శాతం) తగ్గకుండా ఉండటానికి మంచినీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం ఎక్కువగా తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. ముఖ్యంగా గుండె జబ్బులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగకుండా జాగ్రత్త పడాలి. సాధ్యమైనంత వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవడం శ్రేయస్కరం. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆస్పత్రిని సంప్రదించాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు ఎండలో ఎక్కువసేపు ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజలు ఈ హెచ్చరికలను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ వంటి ప్రమాదాలను నివారించవచ్చని స్పష్టం చేశారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# మహిళా ప్రాతినిధ్యం పెరగడం శుభపరిణామం

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి




కోవూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పార్లమెంటులో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నారీ శక్తి వందన్ అధినియం బిల్లు పెట్టనున్న నేపథ్యంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన మహిళా నాయకులతో కలిసి నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్‌లోని ఆమె కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టాలన్న ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయాన్ని భారతదేశ చరిత్రలో చారిత్రక ఘట్టంగా అభివర్ణించారు. గతంలో నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తి హక్కు కల్పించి విప్లవాత్మక మార్పుకు నాంది పలికారని అదే బాటలో చంద్రబాబు నాయుడు మహిళల ఆర్థిక స్వావలంబనకు అడుగులు వేశారని ఆమె గుర్తుచేశారు. స్థానిక సంస్థలు, ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం వల్ల నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రశంసించారు. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ భారత పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నిర్ణయం దేశ చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల ద్వారా సర్పంచులుగా, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు ఛైర్మెన్లుగా ఎన్నికైన మహిళా ప్రజా ప్రతినిధులు తమ పాలనా దక్షతతో అద్భుతాలు సృష్టిస్తున్నారన్నారు. పరిమిత వనరులతో కుటుంబాన్ని నడిపే నేర్పు ఉన్న మహిళలు, ప్రభుత్వ వనరులను కూడా వృధా కాకుండా ప్రజా ప్రయోజనాలకు మళ్లించడంలో మేటి అని నిరూపిస్తున్నారని అన్నారు. నెల్లూరు జిల్లాలో సారా ఉద్యమాన్ని నడిపిన దోబగుంట రోశమ్మ గారి స్ఫూర్తితో మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తుచేశారు. చట్టసభల్లో మహిళలు ఉంటే అట్టడుగు వర్గాల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలు కేవలం ఓటర్లుగానే కాకుండా దేశ గమ్యాన్ని మార్చే నాయకులుగా ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగడం దేశాభివృద్ధికి శుభపరిణామమని పేర్కొంటూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.



# భక్తుల రద్దీతో తిరుమల కిటకిట

తిరుపతి (తితిదే), న్యూస్టుడే: రెండో శనివారం, ఆదివారం నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద తిరుమలకు వెళ్లే వాహనాలు బారులు తీరాయి. నడక మార్గంలోనూ రద్దీ అధికంగా ఉంటోంది. మరోవైపు ఎండవేడితో భక్తులు తల్లడిల్లిపోతున్నారు. టోకెన్ల పంపిణీ కేంద్రాలు, వసతి కేంద్రాలు, నడక మార్గాల్లో తాగునీరు, మజ్జిగ, ఆహారపదార్థాలు వంటివి నిరంతరం అందించాలని భక్తులు, చంటిబిడ్డల తల్లులు, వృద్ధులు కోరుతున్నారు. స్థానిక శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద శనివారం 13 వేల సర్వదర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి ఆదివారం ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడకదారి భక్తులకు మరో రెండువేల టోకెన్లు జారీ చేశారు. తిరుపతి నుంచి అలిపిరి తనిఖీ కేంద్రం మీదుగా తిరుమలకు శనివారం రాత్రి 11 గంటల వరకు మొత్తం 10,726 వాహనాలు వెళ్లాయి. ఆర్టీసీ బస్సులు 928, కార్లు, జీపులు 8,485, తితిదే వాహనాలు 68. ప్రభుత్వ వాహనాలు 37, ఆరు చక్రాల వాహనాలు 65, ద్విచక్ర వాహనాలు 1143 ఉన్నాయి.

# వైభవంగా శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



మార్కాపురం, (చైతన్యరథం): పట్టణంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రథోత్సవం రమణీయంగా సాగింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఇసకేస్తే రాలనంతగా పట్టణం కిక్కిరిసింది. రథంలో ఉభయ దేవేర్లతో స్వామి దివ్యమంగళ స్వరూపాన్ని తిలకించిన భక్త జన కోటి పులకరించిపోయింది. విశేష సుగంధ భరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకృతులైన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుని ఉత్సవరులను తిలకించి భక్తులను పారవశ్యంలో మునిగిపోయారు. ముఖ్య అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ఉత్సవరులను సువర్ణ రజిత మణిమయ భూషిత ఆభరణాలు, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి రథంపైకి చేర్చారు. అనంతరం విశ్వక్సేనఆరాధన, పుణ్యాఃవాచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు బలిహరణ తరువాత రథం కింద గుమ్మడికాయలు పెట్టి, కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు. తమలపాకులు రథంపై చల్లారు. జై చెన్నకేశవ గోవింద నామ స్మరణలతో రథాన్ని లాగారు. నాలుగు మాఢవీధులలో రథంపై విహరించిన చెన్నుడు తిరిగి ఆలయానికి చేరుకున్నాడు. చెన్నకేశవుని దర్శించుకునేందుకు భక్తులు మిద్దెలు, మేడలు బహుళ అంతస్తుల భవనాలు ఎక్కారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ విజయసునీత, జేసీ శ్రీనివాసులు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ సత్య, ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, జనార్దన్, ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ఆర్డీవో ప్రభాకర్ పాల్గొనగా, బ్రహ్మోత్సవాల సేవా సంఘం నాయకులు కాశీవిశ్వనాథం, వక్కలగడ్డ మల్లికార్జునరావు, ఆలంపల్లి శ్రీనివాస్, వెంకటసుధీర్, తాళ్లపల్లి సత్యనారాయణ, చెక్కిలం వెంకటనారాయణరావులు పర్యవేక్షించారు. డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# తిరుపతిలో నెలూరు నేతల పెళ్లి సందడి

## వధూవరులను ఆశీర్వదించిన పద్మభూషణ్ బాలకృష్ణ

నెల్లూరు (చైతన్యరథం): అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కుమారుడు ప్రజయ్ సేనా రెడ్డి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది.. రాజకీయ ప్రముఖులు, బంధుమిత్రుల సమక్షంలో నూతన దంపతులు ఒకటయ్యారు.. నందమూరి బాలకృష్ణ వివాహానికి హాజరయ్యారు.. ఆయన చేతులు మీదగా మంగళసూత్రాన్ని అందుకున్న ప్రజయి సేనా రెడ్డి వధువు మెడలో కట్టారు.. తిరుపతిలోని హోటల్ తాజ్‌లో జరిగిన ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.. టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ రవిచంద్ర, రాజ్యసభ సభ్యులు మస్తాన్ రావు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, చంద్రగిరి ఎమ్మెల్యే నాని, తిరుపతి జిల్లా అధ్యక్షులు పనబాక లక్ష్మి, నరసింహ యాదవ్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, పలమనేరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు హాజరై నూతన దంపతులను మనసారా ఆశీర్వదించారు.





# మంత్రి నారాయణపై ఆరోపణలు చేస్తే సహించం

## అవినీతి నిరూపిస్తే ఇప్పుడే రాజీనామా చేస్తా : వైసీపీ ఆరోపణలపై విరుచుకుపడ్డ రూప్ కుమార్ యాదవ్

నెల్లూరు (చైతన్యరథం): నగర సుందరీకరణపై వైసీపీ నేతలు చేస్తున్న అడ్డగోలు విమర్శలకు మాజీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తన కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, మంత్రి నారాయణపై పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చేసిన 60 కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన ఒక సంచలన సవాల్ విసిరారు. మొక్కల పెంపకంలో ఒక్క రూపాయి అవినీతి జరిగినట్లు నిరూపించినా, నేను నా పదవికి ఇప్పుడే రాజీనామా చేస్తాను. ఒకవేళ మీరు నిరూపించలేకపోతే, మీరు మంత్రి నారాయణకి క్షమాపణ చెప్తారా అని వైసీపీ నేతలను నిలదీశారు. కనీస అవగాహన లేకుండా, రోడ్ల లెక్కలు తెలియకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడితే నెల్లూరు ప్రజలు సహించరని హెచ్చరించారు...వైసీపీ నేత పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి నెల్లూరు నగరంపై గానీ, ఇక్కడి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోడ్ల విస్తీర్ణంపై గానీ కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. మొక్కల పెంపకం పేరుతో 60 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని అడ్డగోలుగా మాట్లాడటం హాస్యాస్పదమని, అసలు ఆ లెక్కలు ఎక్కడివో, ఏ ప్రాతిపదికన ఆరోపణలు చేస్తున్నారో నిరూపించే ధైర్యం ఉందా అని సవాల్ విసిరారు. లోక కల్యాణం కోసం పూర్వం ఋషులు యజ్ఞాలు చేస్తుంటే రాక్షసులు ఏ విధంగా అయితే అడ్డుపడేవారో, మంత్రి నారాయణ నగరాభివృద్ధి కోసం పాటుపడుతుంటే వైసీపీ నేతలు అదే రాక్షస ప్రవృత్తిని ప్రదర్శిస్తున్నారని రూప్ కుమార్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. మంత్రి కేవలం ప్రభుత్వ నిధులే కాకుండా, తన వ్యక్తిగత చొరవతో పెద్ద పెద్ద కంపెనీల నుండి సీఎస్సార్ నిధులు సమకూర్చి నగరాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతున్నారని గుర్తు చేశారు. నారాయణ అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే నారాయణ అని గతంలోనే నిరూపితమైందన్నారు. 2014-19 మధ్య జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇప్పుడు మళ్ళీ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేవలం రాజకీయ ఉనికి కోసమే ఇలాంటి పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నారని, కనీసం ఎన్ని కిలోమీటర్ల మేర మొక్కలు నాటారో కూడా తెలియని వారు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను విమర్శించడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. పచ్చదనాన్ని పెంచడం ద్వారా నగరాన్ని కాలుష్య రహితంగా మార్చాలనే మంత్రి నారాయణ సంకల్పాన్ని అడ్డుకోవాలని చూస్తే నెల్లూరు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అభివృద్ధికి సహకరించకపోయినా ఫరవాలేదు కానీ, ఇలాంటి నిరాధారమైన ఆరోపణలతో కాలం గడపాలని చూస్తే భవిష్యత్తులో ప్రజలు వైసీపీ నేతలను తరిమి కొట్టడం ఖాయమని హెచ్చరించారు.

# శిల్పారామం కాలనీలో కొత్తగా తాగునీటి బోరు

## ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లె సిందూరరెడ్డి, పాల్గొన్న రఘునాథరెడ్డి



పుట్టపర్తి (చైతన్యరథం): పుట్టపర్తి పట్టణంలోని శిల్పారామం కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కొత్తగా తాగునీటి బోరును పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కూడా పాల్గొన్నారు. కాలనీలో గత కొంతకాలంగా తాగునీటి కొరత తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి బోరు త్రవ్వించి తాగునీటి సరఫరా ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు వంటి ప్రాథమిక అవసరాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, సమస్యలు ఉన్న ప్రాంతాల్లో త్వరితగతిన పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు సుధాకర్ ఉమాపతి కృష్ణ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ స్థానిక నాయకులు, అధికారుల, కాలనీ నివాసులు పాల్గొన్నారు. అనంతరం ఎనుములపల్లిలో మాజీ కౌన్సిలర్ ఆదినారాయణమ్మ భర్త గంగాద్రి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధురా రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు పరామర్శించారు. ఆధైర్య పడవద్దని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపాలిటీకి చెందిన కూటమి పార్టీల నాయకులు సా మకోటి ఆదినారాయణ గంగాధర్ నాయుడు, సుధాకర్ ఉమాపతి, అంబులెన్స్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# ఐదు వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి...

## కండువా కప్పి ఆహ్వానించిన పల్లె

పుట్టపర్తి (చైతన్యరథం): ఆమడగూరు మండలం మహమ్మదాబాద్ కు చెందిన 5 వైసీపీ కుటుంబాల వారు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంపై నమ్మకం నుంచి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమడ గూరు మండలం పుట్టపర్తి నియోజకవర్గం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కృష్ణమూర్తి సీనియర్ నాయకుడు చినగానపల్లి వెంకటరెడ్డి ఉన్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారిలో పొగాకు మహబూబ్ బాషా అబ్లూ హుస్సేన్, ముస్తఫా వలి మహబూబ్ తోపాటు పలువురు టీడీపీలో చేరారు.



బుచ్చిరెడ్డిపాళెం (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 100 రోజుల నీటి సంరక్షణ కార్యక్రమంలో సాగునీటి సంఘాల అధ్యక్షులు,

# నీటి భద్రతపై సాగునీటి సంఘాలు సైన్యంలా పనిచేయాలి

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు

రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. బుచ్చిరెడ్డి పాళెం మండలం రేబాల సమీపంలో అమ్మోరి తోపు వద్ద సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో ఇరిగేషన్ సెంట్రల్ ఛానెల్ పూడిక తీత మరియు జంగిల్ క్లియరెన్స్ పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు మాట్లాడుతూ ఏప్రిల్ 6 నుండి జూలై 5 వరకు జరిగే ఈ కార్యాచరణలో భాగంగా ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి నీటి భద్రతపై ప్రజలను భాగస్వాములను చేయాలని ఆమె కోరారు. నీటిని పొదుపుగా వాడుకుంటూ ఆయుకట్టులోని చివరి పొలానికి సాగునీరు అందేలా చూడటం మన అందరి బాధ్యత అని, కాలువల్లో సిల్ట్ క్లియరెన్స్ పనులు చేపట్టి నీటి ప్రవాహాన్ని వేగవంతం చేయాలని ఆమె సూచించారు. ముఖ్యంగా పెన్నా డెల్టా పరిధిలోని కాలువలు, షట్టర్ల మరమ్మత్తులు పూర్తి చేసి, చెరువు కట్టలను బలోపేతం చేయడం ద్వారా భూగర్భ జలాల పెంపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కోవూరు నియోజకవర్గంలో ఇప్పటికే విపిఆర్ ఫౌండేషన్ మరియు ఎఫ్.డి.ఆర్ నిధులతో చాలా వరకు పూడికతీత పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు గుర్తుచేశారు. గత రబీ సీజన్‌లో పంటలు సమృద్ధిగా పండాయని ఎకరాకు నాలుగు పుట్లకు పైగా దిగుబడి రావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బంది కలగకుండా ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి, పౌరసరఫరాల శాఖ మంత్రిని ఆదేశించడం ద్వారా కేవలం 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చూశారని కొనియాడారు. రైతు పక్షపాతిగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి పాళెం, కోవూరు మండలకు చెందిన సాగునీటి సంఘ అధ్యక్షులు, తెలుగుదేశం కూటమి పార్టీల ముఖ్యనాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబు చొరవతో చెరువులకు రాయలనాటి వైభవం

**'నీరు లేనిదే జీవరా మనుగడ లేదు.. జల వనరులను కాపా డుకోవడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. ప్రజలందరి సామా జిక బాధ్యత'.. అంటూ సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం జల సంరక్షణకు శ్రీకారం చుట్టింది.**

కర్నూలు (చైతన్యరథం): భూగర్భ జలాలు పెంచేం దుకు ప్రతి మండలంలో దాదాపు రూ.2.5 నుంచి రూ.5కోట్ల విలువైన పనులు చేపట్టబో తున్నారు. ఈనెల 15లోగా ప్రతిపాదనలు పూర్తి చేయాలి. డ్వామా, జలవనరులు, భూగర్భజలాలు, వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధక వంటి కీలక శాఖలను భాగస్వామ్యం చేశారు. కోసిగి, పెద్దకడబూరు మండలాల్లో ప్రమాదకర స్థాయిలో భూగర్భజలాలు పడిపోయాయని గుర్తించారు. గురువారం కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి కోసిగిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నతరహా నీటిపారుదల శాఖ పరిధిలోని కర్నూలు, డోన్, పత్తి కొండ, ఆదోని సబ్ డివిజన్లలో 100ఎకరాల ఆయకట్టు పైబడిన చెరువులు 60, వంద ఎకరాల లోపు ఆయకట్టు కలిగిన చెరువులు 250 ఉన్నాయి. 310 చెరువుల్లో నీటినిల్వ సామర్థ్యం 4.411 టీఎంసీలు. 33,113 ఎకరాల ఆయకట్టు ఉంది. అత్యధిక చెరువులు శ్రీకృష్ణదేవ రాయుల కాలంలో నిర్మించినవే. మరమ్మతులు, పూడిక తీత చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలు, పూడిక, ముళ్లకంపలతో చెరువులు నిండి పోయాయి. చెరువులోకి వర్షపు నీరు చేరే వాగులు (ఫీడర్ ఛానల్స్), పంట కాలువలు (ఫీల్డ్ ఛానల్స్) పూడిపోగా, తూములకు మరమ్మతులకు నోచుకోవడం లేదు. డ్వామా ఆధ్వ ర్యంలో నిర్మించిన చెక్ డ్యాంలదీ ఇదే పరిస్థితి. గత టీడీపీ హ యాంలో 'నీరు-చెట్టు' నిధులతో జల సంరక్షణ పనులు చేప ట్టారు. ఆతరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో చెరువులు, చెక్‌డ్యాంలు మళ్లీ పూర్వస్థితికి చేరుకున్నాయి.

### ఈనెల 15లోగా ప్రతిపాదనలు సిద్ధం

జీరాంజీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే భూగర్భ సంరక్షణ పనులను గ్రామస్థాయి కమిటీ ఆధ్వర్యంలో గుర్తి స్తారు. ప్రతిపాదనలు తయారుచేసి ఉపాధి పథకంకు చెందిన యుక్త ధార యాప్ (పోర్టర్)లో అప్‌లోడ్ చేయాలి. ఈనెల 15లోగా ప్రతిపా దనలు సిద్ధంచేసి, కలెక్టర్ ఆమోదం తీసుకొని, 16వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా పనులు మొదలుపెట్టి, జూలై 14వరకు కొనసా గిం చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ప్రతి మండలంలో దాదాపుగా రూ.2.50కోట్ల నుంచి రూ.5కోట్లకు పైగా పనులు చేపట్టే అవకాశం ఉంది. తుగ్గలి, ఆదోని, దేవనకొండ వంటి పెద్ద మండలాల్లో రూ.10-15 కోట్లు విలువైన పనులు చేపట్టే అవకాశం ఉందని డ్వామా అధికారి తెలిపారు.

### చేపట్టాల్సిన పనులు

చెరువుల్లో పూడిక తీత, గట్టు బలోపేతం, ఫీడర్, ఫీల్డ్ ఛానల్స్ జంగిల్ క్లియరెన్స్, చెక్‌డ్యాంలో పూడికతీత, మరమ్మతులు. కొండ ప్రాంతాల్లో కాంటూరు కందకాల తవ్వకాలు. రైతు పొలాల్లో ఫారం పాండ్స్, ప్రభుత్వ భూముల్లో డగౌట్ ఫా రం పాండ్స్ తవ్వకాలు, ఫారం పాండ్స్ ఫీడర్ ఛానల్స్‌ల్లో పూడికతీత పనులు. భూగర్భజలాలు పెంచేందుకు పనులు చేపట్టాలి. జిల్లా కమిటీ: ఈ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ ఉంటారు. వివిధ శాఖల సమన్వయ బాధ్యతలు జాయింట్ కలెక్టర్ చూస్తారు. డ్వామా పీడీ, జలవనరులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు, గ్రౌం డ్వాటర్ డిపార్‌మెంట్ అధికారి, వ్యవసాయం, ఉద్యావనం, పశు సం వర్ధక శాఖల జేడీలు, డీఎఫ్‌వో, ప్రాజెక్టు కమిటీల చైర్మన్లు సభ్యులుగా ఉంటారు. మండల కమిటీ: ఎంపీడీవో చైర్మన్‌గా ఉంటారు. జిల్లా కమి టీల్లో ఉండే వివిధ శాఖ మండల అధికారులు, ఉపాధి హామీ పథకం ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ (ఈసీ), సాగునీటి సంఘాల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

**గ్రామ కమిటీ:** పంచాయతీ డెవప్‌మెంట్ ఆఫీసర్ (పీడీవో) చైర్మన్‌గా ఉంటారు. స్వర్ణ సచివాలయంలో పనిచేసే విలేజ్ అగ్రిక ల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, అటవీ శాఖ సిబ్బంది, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్, గ్రామ స్థాయిలో సాగునీటి సంఘాల చైర్మన్లు సభ్యులు.

భూగర్భ జలాలు (గ్రౌండ్ వాటర్) విభాగం అధికారులు ఇచ్చిన నివేదిక పరిశీలిస్తే కోసిగి మండలంలో ప్రమాదకర స్థాయికి భూగర్భ జలాలు పడిపోయాయి. భూమట్టం నుంచి 20మీటర్లు కంటే దిగువ (లోతు)కు పడిపోయాయి. ఆస్పరి, కల్లూరు, ఓర్వకల్లు, మద్దికెర, ఎమ్మిగనూరు మండలాల్లో 8-20మీటర్ల మధ్య లోతుకు భూగర్భ జలాలు చేరాయి. చిప్పగిరి, పెద్దకడబూరు మండలాల్లో 0-3 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉంటే, మిగిలిన మండలాల్లో 3-8 మీటర్ల లోతులో ఉన్నాయి. భూగర్భ నీటిలెక్కల్ని పరిగణలోకి తీసుకొని ఆయా మండలాల్లో భూగర్భజలాలు పెంచే పనులు చేపడుతారు. కోసిగి, ఆదోని, ఆస్పరి, కల్లూరు, ఓర్వకల్లు, మద్దికెర, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాలపై ప్రత్యేక దృష్టికి కేంద్రీకరిస్తారు.

# పరిమళించిన మానవత్వం



- సౌదీ నుంచి క్షేమంగా భారత్‌కు చేరుకున్న మెహబూబ్
- అండగా నిలిచిన సౌదీ అరేబియా తెలుగు సంఘం

సౌదీ అరేబియా: ఒక అత్యవసర ఫోన్ కాల్ మార్చి 17న ఉదయం సౌదీ అరేబియా తెలుగు సంఘం (ఎస్ఏటీఎస్) ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ప్రవీణ్ కోలేటికి వచ్చింది. విమానాశ్రయంలో మెహబూబ్ పీర్ షేక్ అనే వ్యక్తి భయంతో మాట్లాడలేని స్థితిలో ఒంటరిగా నిలబడి దుఃఖంతో ఏడుస్తూ ఉన్నాడు. ఆకలితో అలమటిస్తూ దీనస్థితిలో ఉన్నారని సమాచారం అందింది. వెంటనే సాట్స్ సభ్యులు ప్రవీణ్ కోలేటి, ఎన్విబి కిషోర్ ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా విమానాశ్రయానికి చేరుకున్నారు. మెహబూబ్‌కు ధైర్యం చెప్పి సురక్షితంగా జుబైల్‌కు తీసుకెళ్లి తమ బ్యాచిలర్ క్యాంప్‌లో ఆశ్రయం ఇచ్చారు. ఆ తర్వాత విమాన టికెట్‌కు డబ్బు సేకరించి క్షేమంగా భారత్‌కు పంపారు.

## ఎడారిలో పనికి కుదిరి..చివరకు

మెహబూబ్ 9 నెలల క్రితం కువైట్ దేశానికి (ఏపీలోని కడప ప్రాంతానికి చెందిన వ్యక్తి) వీసా మీద తనకి పరిచయమున్న ఒక డ్రైవర్ సహాయంతో వచ్చారు. 15 రోజుల తర్వాత యజమాని తనను కువైట్ – సౌది అరేబియా సరిహద్దు ప్రాంతంలోకి తీసుకెళ్లి ఎడారిలో ఒంటెలు కాసే పని అప్పగించాడు. కానీ ఆ పనికి మెహబూబ్ ఒప్పుకోలేదు. అప్పుడు యజమాని చాలా సందర్భాల్లో కొడుతూ ఉన్నా ఈ బాధలను భరిస్తూ జీవితాన్ని భారంగా గడుపుతున్న సమయంలో పైల్స్‌తో పాటు..ఎడారి ఎండల వల్ల చర్మ వ్యాధి ఒళ్లంతా వ్యాపించింది. అలాంటి దీనమైన పరిస్థితుల్లో అతను తన యజమానిని ప్రాధేయపడగా అతడు కొన్ని షరతుల మీద ఒప్పుకున్నాడు. తాను వీసాకు ఖర్చు చేసిన మొత్తాన్ని తిరిగి ఇవ్వవలసిందిగా కోరాడు. దీంతో మెహబూబ్ పూర్తి గా అయోమయ స్థితికి చేరుకున్నాడు. అప్పుడు తన ను కువైట్ తీసుకు వచ్చిన డ్రైవర్ సహయం కోరగా ఆయన సానుకూలంగా స్పందించి వీసాకు అయిన సొమ్మును యజమానికి ఇచ్చాడు. అదే డ్రైవర్ తిరిగి వెళ్లటానికి టికెట్ కూడా ఇచ్చాడు. ఆ టికెట్ తీసుకుని అతి కష్టంపై విమానా శ్రయానికి చేరుకున్నాడు. కానీ యుద్ధ వాతావరణం వల్ల టికెట్ రద్దయింది. దీంతో తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనైన మెహబూబ్ సాయం కోసం వేచి చూస్తూ ఉన్నాడు.

## ఫ్లైట్ టికెట్‌కు సాట్స్ సహకారం

సమాచారం తెలుసుకున్న సౌదీ తెలుగు సంఘం సభ్యులు ప్రవీణ్, కిషోర్ అతని వద్దకు వెళ్లగా తొలుత వారిద్దరినీ మెహబూబ్ నమ్మలేదు. యజమాని తనని మళ్లీ తిరిగి తీసుకురమ్మని ఎవరినైనా పురమాయించాడేమోనని అనుమానించాడు. ఎంతో ఓపికతో కిషోర్, ప్రవీణ్ అతడిని మూడుగంటల పాటు మాట్లాడి ఒప్పించి వారితో తీసుకెళ్లారు. ఆతనికి ఆశ్రయం ఇచ్చి పూర్తిస్థాయి భద్రత కల్పించారు. మరో సభ్యుడు మనోహర్ ప్రసాద్ అతని వీసా, లీగల్ స్టేటస్‌ను పరిశీలించారు. అతని అన్ని డాక్యుమెంట్లు చెల్లుబాటు అవుతాయని, సౌదీ వీసా యాక్టివ్‌గా ఉందని తేలింది. ఇప్పుడు మిగిలింది ఒక్కటే ఇండియాకు టికెట్ బుక్ చేయడం. టికెట్ ధరలు ఎక్కువగా ఉండటంతో ఎస్ఏటీఎస్ సభ్యులకు సహాయం కోసం విజ్ఞప్తి పంపించారు. కొద్ది గంటల్లోనే సభ్యుల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. శివరామకృష్ణ సిరిగిన, అమర్నాథ్‌రెడ్డి సింగనమల, వెంకట కృష్ణస్వామి, సోహేబ్ అందించిన సహకారంతో టికెట్ బుక్ చేశారు. ఎట్టకేలకు మెహబూబ్ ఏప్రిల్ 10న భారత్‌లోని స్వస్థలానికి చేరుకున్నారు.

## ఇంటికి చేరే వరకూ అన్నీ తామై

మార్చి 17 నుంచి ఏప్రిల్ 10 వరకు మెహబూబ్‌కు ఎన్వీబీ కిషోర్ ఆశ్రయం, ఆహారం, వైద్య సహాయం, వ్యక్తిగత సంరక్షణ అన్నింటినీ తన సొంత ఖర్చులతో అందించారు. ప్రవీణ్ కోలేటి ప్రతి నిర్ణయంలో అండగా నిలిచి సేవా కార్యక్రమానికి అండగా నిలిచారు. మనోహర్ ప్రసాద్ వీసా, డాక్యుమెంటేషన్, లీగల్ ప్రక్రియలను పూర్తి చేశారు. బాధితుడు ఇల్లు చేరుకునే వరకు సాట్స్ ప్రెసిడెంట్ కోనేరు ఉమామహేశ్వరరావు పర్యవేక్షించారు. ఎట్టకేలకు మెహబూబ్ పీర్ షేక్ సురక్షితంగా తన ఇంటికి చేరుకున్నారు. మానవత్వం ఇంకా సజీవంగా ఉందని సౌదీ తెలుగు సంఘం సభ్యులు నిరూపించారు. తనకు అన్ని విధాలా అండగా నిలిచిన సౌదీ తెలుగు సంఘం సభ్యులకు మెహబూబ్ కృతజ్ఞతలు తెలిపారు.




## టీటీఏ మెగా కన్వెన్షన్ సన్నాహక సందడి

న్యూజెర్సీ: తెలంగాణ అమెరికా తెలుగు సంఘం (టీటీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న టీటీఏ మెగా కన్వెన్షన్ 2026 సన్నాహక కార్యక్రమాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా న్యూజెర్సీలో నిర్వహించిన కన్వెన్షన్ కిక్ ఆఫ్ – మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. ఎడిసన్‌లోని అక్బర్ రెస్టారెంట్ వేదికగా శనివారం సాయంత్రం జరిగిన ఈ వేడుకలో టీటీఏ వ్యవస్థాపకులు పైళ్ళ మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్వెన్షన్ లోగోను ఆవిష్కరించి రాబోయే మహాసభల ప్రాముఖ్యతను వివరించారు. టీటీఏ మెగా కన్వెన్షన్ 2026, జూలై 17 నుండి 19 వరకు నార్త్ కరోలినాలోని షార్లెట్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరగనుంది. కిక్ ఆఫ్ ఈవెంట్‌లో ప్రముఖ గాయకులు అద్వైత్, చైతు మద్దూరి తమ పాటలతో అలరించారు. టీటీఏ ప్రెసిడెంట్ నవీన్‌రెడ్డి మల్లిపెద్ది, కన్వెన్షన్ కన్వీనర్ ప్రవీణ్ చింత, కోఆర్డినేటర్లు నరేన్ దేవరపల్లి, శేఖర్‌రెడ్డి తదితర ముఖ్యనేతలు పాల్గొన్నారు. న్యూజెర్సీ టీమ్ ప్రతినిధులు శివ రెడ్డి కొల్ల (జనరల్ సెక్రటరీ), నరసింహ పెరుక, సుధాకర్ ఉప్పల, అరుణ్ అర్కల ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిటిఏ కన్వెన్షన్ కు సంబంధించి మరిన్ని వివరాల కోసం *www.ttaconvention. org* వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని నిర్వాహకులు కోరుతున్నారు.

## డబ్లిన్‌లో 19న సీటీఏ కార్నివాల్

డబ్లిన్: కొలంబస్ తెలంగాణ అసోసియేషన్ (సీటీఏ) ఆధ్వర్యంలో ఈ ఏడాది హోలీ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓహియోలోని డబ్లిన్ నగరంలో 'హోలీ కార్నివాల్' పేరుతో ఈ రంగుల పండుగను జరుపుకోనున్నారు. డబ్లిన్‌లోని డబ్లిన్ కాఫ్మన్ పెవిలియన్ వేదికగా ఏప్రిల్ 19న మధ్యాహ్నం



1:30 గంటల నుంచి ఈ వేడుకలు ఆరంభం కానున్నాయి. డీజే సంగీతం, డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌లతో పాటు కార్నివాల్ తరహాలో వినోద కార్యక్రమాలు ఉంటాయి. ఈ వేడుకలకు ఎంట్రీ ఉచితం. అసోసియేషన్ మెంబర్లకు 2 ఉచిత కలర్ ప్యాకెట్లు, 2 ఉచిత కార్నివాల్ బ్యాండ్లు అందజేస్తారు. వివిధ రకాల రుచికరమైన ఫుడ్ వెండర్స్ అందుబాటులో ఉంటారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను సీటీఏ ప్రతినిధులు రంజిత్ గంపా, విష్ణు తూముల, పవిత్ర కోట, పున్నం వెల్పుల, సృజన్‌రెడ్డి, సురేష్ ముఖిరాల పర్యవేక్షిస్తున్నారు. తెలుగు కుటుంబాలన్నీ ఈ వేడుకల్లో పాల్గొని కన్నుల పండగగా జరిగే ఈ రంగుల పండుగను విజయవంతం చేయాలని వారు కోరారు. మరిన్ని వివరాల కోసం, రిజిస్ట్రేషన్ కోసం *www.zeffy.com/en-US/ticketing/holi*–2 వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.



# పార్లమెంటుకు తుక్డే తుక్డే గ్యాంగ్

- దోపిడీదారులకు ముకుతాడు వేస్తాం
- టీఎంసీపై ప్రధాని మోదీ ఘాటు విమర్శలు



సిలిగురి: బెంగాల్‌లో 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న టీఎంసీ తీవ్ర అవినీతి, హింస, బెదిరింపు రాజకీయాలతో అవకతవకల పాలన సాగించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాజకీయ హింస, ప్రతిపక్ష కార్యకర్తలను బెదిరించడం, భయోత్పాత వాతావరణం సృష్టిం చిందని చెప్పారు. విపక్ష కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం, కొన్ని సందర్భాల్లో హత్యలు చోటుచేసుకున్నాయని, ఇలాంటి చర్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని అన్నారు. ఈ పరిస్థితి ఇంకెంతోకాలం సాగదని, రాష్ట్ర రాజకీయ వాతావరణంలో మార్పు అవసరమని ప్రధాని పిలుపునిచ్చారు.

### మే 4 తర్వాత మాదే ప్రభుత్వం

'టీఎంసీ వాళ్లు జాగ్రత్తగా వినాలి. మే 4 తర్వాత రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుంది. గత 15 ఏళ్లుగా టీఎంసీ ప్రతీ చర్యకు, ప్రతీ పైసాకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. బెదిరించడం, భయోత్పాతం సృష్టించడం, రాజకీయ హింస, పార్టీ కార్యకర్తలను చంపడం వంటివి టీఎంసీ విధానంగా మారాయి. ఇక చాలు. బెంగాల్ ప్రజలు వీటిని సహించేందుకు సిద్ధంగా లేరు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అనేది బీజేపీ మంత్రం. బెంగాల్‌లో సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, టీఎంసీ దోపిడీదారులకు ముకుతాడు వేయడం మా మంత్రం' అని స్పష్టం చేశారు. టీఎంసీ విభజన ఎజెండాలు జాతీయ ఐక్యత, ప్రాంతీయ భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నాయని ప్రధాని విమర్శించారు. సిలిగురి కారిడార్, ఈశాన్య ప్రాంతాల విషయంలో చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ప్రస్తావిస్తూ, సిలిగురి కారిడార్‌ను విడదీస్తామని తుక్డే తుక్డే గ్యాంగ్ బెదిరిస్తోంది, అలాంటి వారిని పార్లమెంటుకు టీఎంసీ పంపుతోందని ఆరోపించారు. ఈశాన్య రాష్ట్రాలకు గేట్‌వేగా ఉన్న సిలిగురి కారిడార్ అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తోందని చెప్పారు.

### మహిళలకు ప్రత్యేక రక్షణ

బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో జరుగుతున్న హింసాకాండ, మహిళలపై పెరుగుతున్న నేరాలను అరికట్టేందు కు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. మహిళల రక్షణకు అవసరమైన పోలీస్ సపోర్ట్ సిస్టమ్ తీసుకువస్తామని, మహిళలపై జరుగుతున్న నేరాలపై సత్వర న్యాయాన్ని అందిస్తామని మోదీ హామీ ఇచ్చారు. రాజకీయ హింసపై విచార ణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామని, నేర, మాఫియా కార్యకలాపాల్లో ప్రమేయమున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు..

# మద్దతు కోరుతూ ఎంపీలకు మోదీ లేఖ



న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ చట్ట (నారీ శక్తి వందన్ అధినియమ్) సవరణ బిల్లుకు మద్దతు కోరుతూ అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లేఖ రాశారు. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేందుకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నా రు. 2029 లోక్‌సభ ఎన్నికలను మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తో నిర్వహిద్దామని అన్నారు. విస్తృత సంప్రదింపుల అనంతరం నారీ శక్తి వందన్ అధినియమ్ అమలుకు సమయం ఆసన్నమైందనే నిశ్చితాభిప్రాయానికి వచ్చామని, 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్‌తో నిర్వహించడం అనివార్యమని అని ఆ లేఖలో ప్రధాని పేర్కొన్నారు. మహిళలు, భవిష్యత్తు తరాల కోసం బాధ్యత తీసుకోవాలని పార్టీలను కోరారు. ఇందుకోసం పార్లమెంటులో చర్చను స్వాగతిస్తున్నామని చెప్పారు. 'మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును ఆమోదించే విషయంలో అందరినీ ఒకేతాటిపైకి రావాలని కోరేందుకు ఈ లేఖ రాస్తున్నాను. పార్లమెం టులో ఎక్కువ మంది తమ అభిప్రాయాలను పంచుకోవ డం అందరికీ గర్వకారణమవుతుంది. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా, మహిళలు, భవిష్యత్తు తరాల పట్ల బాధ్యతను చాటుకునే సందర్భమిది. మహిళలకు రిజర్వేషన్ కల్పించా లని చాలాకాలంగా సభ్యులు కోరుతున్నారు. వారి ఆకాంక్షలు కార్యరూపంలోకి వచ్చే సమయం ఇప్పుడు వచ్చింది. 140 కోట్ల భారతీయులు, నారీశక్తి సాధించిన విజయం ఇది. ఈ చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించేం దుకు అంతా కలిసికట్టుగా ముందుకు వస్తారనే పూర్తి నమ్మకం నాకు ఉంది' అని మోదీ ఆ లేఖలో పేర్కొన్నారు. మహిళలు ఎదిగేందుకు, నిర్ణయాలు తీసుకునేందుకు, ప్రత్యేకించి నాయక త్వం వహించేందుకు ఎంతగా అవకాశమిస్తే అంతగా సమాజం ప్రగతి పథంలోకి వెళ్తుందని మోదీ అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా ఇండియా విజన్ సాకారం కావాలంటే ఈ ప్రయాణంలో మహిళలు కీలకమైన, చురుకైన పాత్ర పోషించడం అవసరమని అన్నారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ ప్రారంభించనున్నట్టు ఆ లేఖలో ప్రధాని తెలిపారు.

# తమిళనాట హోరాహోరీగా ఎన్నికల ప్రచారం



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హోరా హోరీగా సాగుతోంది. 234 నియోజకవర్గాలు ఉన్న రాష్ట్రంలో ఈ నెల 23న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. అధికార డీఎంకే సారథ్యంలోని కూటమి వరుసగా రెండోసారి విజయం సాధించి రికార్డు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఈసారైనా అధికారాన్ని కైవసం చేసుకోవాలని అన్నాడీఎంకే నేతృత్వంలోని కూటమి పట్టుదలతో ప్రయత్నిస్తోంది. ఇక ఒంటరిగా బరిలోకి దిగిన సినీ నటుడు 'దళపతి' విజయ్ సారథ్యంలోని 'తమిళగ వెట్రి కళ గం'(టీవీకే) తీవ్రంగా శ్రమిస్తోంది. మరోవైపు.. దివంగత ముఖ్య మంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ స్థాపించిన 'ఆలిండి యా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఐపీటీఎంఎంకే), పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ వర్గం, సినీ దర్శకుడు సీమాన్ స్థాపించిన 'నామ్ తమిళర్ కట్చి'(ఎన్‌టీకే) తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అయితే ముఖ్యంగా తొలి రెండు కూటముల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కానీ, విజయ్ నేతృత్వంలోని టీవీకే చీల్చే ఓట్లపైనే డీఎంకే-అన్నాడీఎంకే కూటముల జయాపజయాలు ఆధారపడి ఉంటాయని విశ్లేషిస్తున్నాయి.

మొత్తం 234 అసెంబ్లీ సీట్లలో 164 స్థానాల్లో అధికార డీఎంకే పోటీకి దిగింది. మిగిలిన స్థానాలను ఆ పార్టీ నేతృత్వంలోని కూట మి పార్టీలకు కేటాయించింది. ఇందులో కాంగ్రెస్‌కు 28 స్థానాలు ఉన్నాయి. ఇక 'ఎన్‌డీఏ' కూటమికి నేతృత్వం వహిస్తున్న అన్నాడీ ఎంకే.. 167 స్థానాల్లో పోటీ చేయనుంది. మిగిలిన సీట్లలో బీజేపీకి 27 స్థానాలను కేటాయించింది. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ మొత్తం 234 స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టింది. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే సంక్షేమాన్ని, తమిళ అస్తిత్వాన్ని ప్రధాన అస్త్రాలుగా చేసుకుంది. మాజీ సీఎం, అన్నాడీఎంకేలో సుదీర్ఘకాలం పనిచేసిన ఓ.పన్నీర్‌సెల్వం(ఓపీఎస్) ఎన్నికలకు ముందు డీఎంకేలో చేరడం కలిసి వస్తుందని ఆ పార్టీ భావిస్తోంది.

అధికారాన్ని మళ్లీ చేజిక్కించుకునేందుకు అన్నాడీఎంకే తీవ్రం గా శ్రమిస్తోంది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పా డి పళనిస్వామి(ఈపీఎస్) అన్నీ తానై పార్టీని, కూటమిని నడుపుతున్నారు. ఇప్పుడు ఆయన ఇమేజ్‌పైనే కూటమి భవితవ్యం ఆధారపడిందన్న భావన వ్యక్తమవుతోంది. అయితే తమిళనాట వివిధ ప్రైవేటు సంస్థలు జరిపిన సర్వేల్లో అధికార డీఎంకేదే ఈసారి కూడా పైచేయిగా కనిపిస్తోంది. 'కేకే సర్వేస్' అంచనా ప్రకారం డీఎంకే 41.5 శాతం ఓట్లతో మళ్లీ అధికారం సాధించనుండగా, అన్నాడీఎంకే 36.2 శాతం,టీవీకే 13.6 శాతం ఓట్లను సాధించనున్నాయి.

రెండేళ్ల క్రితం పురుడు పోసుకున్న విజయ్ నేతృత్వంలోని టీవీకే కీలకంగా మారనుందన్న అంచనాలున్నాయి. డీఎంకే-అన్నాడీఎంకేల జయాపజయాలను ఈ పార్టీ నిర్దేశించే అవకాశం ఉందని రాజకీయ పండితులు చెబుతున్నారు. అయితే టీవీకే క్షేత్రస్థాయిలో బలోపేతంకాలేదు. ఓటర్లను బూత్ వరకు తీసుకురాగలిగే క్యాడర్ లేకపోవడం ఆ పార్టీకి పెద్ద మైనసగా మారింది. విజయ్‌కు జై కొట్టేవారే తప్ప, బూత్‌స్థాయి మేనేజ్‌మెంట్ చేయగలిగిన నేతలు పార్టీలో కనిపించడం లేదు. కానీ, విజయ్ ప్రభావంతో పార్టీకి గణనీయ మైన ఓట్లు వస్తాయని, ఆ పార్టీ చీల్చే ఓట్ల మీదనే డీఎంకే-అన్నాడీఎంకేల జయాపజయాలుఆధారపడి ఉంటాయని పరిశీలకులు చెబుతున్నారు.

## పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు..

# మూడు లైన్ల విప్ జారీ చేసిన బీజేపీ



న్యూఢిల్లీ: ఈనెల 16,17,18 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో తమ పార్టీ ఎంపీలకు బీజేపీ మూడు లైన్ల విప్ జారీ చేసింది. ఎంపీలంతా ఈ సమావేశాల సమయంలో తప్పనిసరిగా హాజరుకావాలని ఆ విప్‌లో కోరింది. కేంద్ర మంత్రు లతో సహా ఎంపీలంతా ఈ మూడు రోజులు సభలోనే ఉండాలని, ఎలాంటి సెలవులు మంజూరు చేసేదిలేదని, హాజరు కచ్చితంగా ఉండాలని విప్ పేర్కొంది. ఈ ప్రత్యేక సమావేశాల్లో ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ సవరణ బితల్లుపై దృష్టి పెట్టడం, రిజర్వేషన్ అమలు కాలపరిమితికి సంబంధించి కీలక సవరణలు చేసే అవకాశం ఉంది. జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్ అమలు కావాలని నారీశక్తి వందన్ అధినయం-2023 చెబుతోంది. అయితే జనగణనలో జాప్యం జరుగుతున్నందున 2011 జనాభా లెక్కల ఆధారంగానే ముందు కువెళ్లాలని కేంద్రం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్లు అమలయ్యేందుకు పార్టీలకు అతీతంగా అంద రూ ఏకగ్రీవంగా మద్దతు తెలపాలని ఎంపీలను ప్రధాని మోదీ కోరారు. ఈ మేరకు పార్టీల ఫ్లోర్ లీడర్లకు ఆయన లేఖ రాశారు. 16వ తేదీ నుంచి నారీ శక్తి వందన్ అధినియంపై చారిత్రక చర్చ జరుగుతుందని, ఈ ప్రత్యేక సమావేశం మన ప్రజాస్వామ్య మరింత పటిష్టం చేసే అవకాశమవుతుందని చెప్పారు. సవరణ బిల్లుకు ఆమోదం తెలుపుతూ పార్లమెంటు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంటుందనే గట్టి నమ్మకం తనకుందని అన్నారు.

## జూలై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర

శ్రీనగర్: అమర్‌నాథ్ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు చేపట్టే యాత్ర జూలై 3వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రకటించారు. ఆగస్టు 28వ తేదీన ఈ యాత్ర ముగుస్తుందన్నారు. మొత్తం 57 రోజుల పాటు ఈ అమర్‌నాథ్ యాత్ర కొనసాగుతుందని చెప్పా రు. ఆదివారం జమ్మూలోని లోక్‌భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా విలేకర్లతో మాట్లాడుతూ.. ఏప్రిల్ 15వ తేదీ ఆ యాత్రలో పాల్గొనేవారు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించా రు. అమర్‌నాథ్ బోర్డు నిబంధనల ప్రకారం 13 లోపు.. 70 ఏళ్ల వయస్సు పైబడిన వారిని ఈ యాత్రకు అనుమతించమని ఆయన స్పష్టం చేశారు. జమ్మూ కశ్మీర్ బ్యాంకు, ఎస్‌బీఐ, ఎస్ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకులకు దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో దరఖాస్తుదారులు ముందస్తు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

# గొంతు మూగబోయింది!

- ప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే కన్నుమూత
- వివిధ రంగాల ప్రముఖుల సంతాపం
- నేటి సాయంత్రం శివాజీ పార్క్‌లో అంత్యక్రియలు

ముంబై: ప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే (92) తుది శ్వాస విడిచారు. శనివారం సాయంత్రం ఆమె అస్వస్థతకు లోనయ్యారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ సోకడంతో ఆమెను ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చేర్పించగా ఆదివారం తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆమె కుమారుడు ఆనంద్ భోంస్లే ధ్రువీకరించారు. తన తల్లి అంత్యక్రియలను సోమవారం సాయంత్రం ముంబైలోని శివాజీ పార్క్‌లో నిర్వహిస్తామని చెప్పారు. 1933లో జన్మించిన ఆశా భోంస్లే పదేళ్ల వయసులో ఒక మరాఠీ సినిమాలో తొలి పాటను పాడారు. ఆ తరువాత దాదాపు ఎనిమిది దశాబ్దాల పాటు తన అద్భుత గాత్రంతో సంగీత ప్రియులను అలరించారు. 2023లో తన 90వ పుట్టిన రోజు సందర్భంగా దుబాయ్‌లో లైవ్ కార్యక్రమంలో ఏకంగా మూడుగంటల పాటు పాడి అభిమాను లను ఆశ్చర్యంలో ముంచెత్తారు. సంగీత ప్రపంచంలో ఎనలేని ప్రతిభ కనబరిచిన ఆమె పద్మ విభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులతో పాటు అనేక ఇతర సత్కారాలను అందుకున్నారు. ఆశా భోంస్లే మృతిపై వివిధ రంగాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# అమెరికా-ఇరాన్ చర్చలు విఫలం

- అర్ధంతరంగా తిరిగి వెళ్లిన జెడి వాన్స్ బృందం
- యుద్ధంతో సాధించలేనివి డిమాండ్ చేశారన్న ఇరాన్
- వైఫల్యానికి అమెరికా కారణమని వ్యాఖ్య
- అప్పుడు బెదిరించి.. ఇప్పుడు భయపడుతోంది: నెతన్యాహు



పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా- ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చలు విఫలమయ్యాయి. అర్ధంతరంగా చర్చలను ముగించి జేడీ వాన్స్ బృందం వెనక్కి వెళ్లిపోయింది. అనేక గంటలు సుదీర్ఘంగా సాగిన చర్చల్లో ఇరుదేశాల మధ్య ఎలాంటి ఒప్పందం జరగలేదు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్వయంగా ఈ విషయాన్ని పేర్కొన్నారు. చర్చలు ముగిసిన అనంతరం వాన్స్ ఇస్లామాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 21 గంటలు నిరంతాయంగా ఇరాన్‌తో తాము చర్చలు జరిపామన్నారు. అనేక కీలకమైన విషయాలపై చర్చించినట్టు వెల్లడించారు. అయితే, ఈ చర్చల్లో ఎలాంటి ఒప్పందానికీ రాలేకపోయామని స్పష్టం చేశారు. ఒప్పందానికి అనుకూలంగా తాము షరతలు విధించామని.. కానీ వాటిని ఇరాన్ ప్రతినిధులు అంగీకరించలేదని వాన్స్ పేర్కొన్నారు. చర్చల్లో తాము చాలా సానుకూలంగా వ్యవహరించామన్నారు. సద్భావనతో ఇక్కడికి వచ్చి.. ఒక ఒప్పందం చేసుకునేందుకు తమ వంతు ప్రయత్నం చేశామన్నారు. కానీ, దురదృష్టవశాత్తు ఎలాంటి పురోగతి సాధించలేకపోయామన్నారు. ఇది అమెరికా కంటే.. ఇరాన్‌కే దురదృష్టకర వార్తగా పేర్కొన్నారు. ఎలాంటి ఒప్పందం కుదరకుండానే తాము.. అమెరికాకు తిరిగి వెళ్లిపోతున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఇరాన్ తన అణ్వాయుధాలను సమకూర్చుకోవడానికిగానీ.. దాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నించకుండా ఉంటామనే స్పష్టమైన హామీని అమెరికా కోరుతోందని వాన్స్ అన్నారు. అయితే, ఇందుకు ఇరాన్ నిరాకరించిందన్నారు. ఎలాంటి ఒప్పందం కుదరనప్పటికీ.. తమ ప్రతిపాదనపై స్పందించేందుకు ఇరాన్‌కు ఇంకా సమయం ఇవ్వనున్నట్టు వాన్స్ సూచించారు. పాక్‌లో చర్చల నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తాము నిరంతరం ఫోన్లో మాట్లాడుతూనే ఉన్నామని పేర్కొన్నారు. విదేశాంగమంత్రి మార్కో రూబియా, రక్షణ మంత్రి పీట్‌హెగ్సెత్, ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్లతో కూడా నిరంతరం టచ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశం అనంతరం వాన్స్ నేతృత్వంలోని యూఎస్ ప్రతినిధుల బృందం పాక్‌ను వీడింది.

### యుద్ధంతో సాధించలేనివన్నీ డిమాండ్ చేశారు



అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఇరాన్ తమ షరతులు అంగీకరించని కారణంగా ఎలాంటి ఒప్పందం కుదరలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. అయితే, అమెరికా చేసిన.. అర్థంలేని డిమాండ్లే ఈ చర్చలు విఫలమవడానికి కారణమని ఇరాన్ ఆరోపించింది. యుద్ధంతో సాధించలేని వాటిని వారు ప్రస్తావించారని పేర్కొంది. ప్రజల జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం.. తమ ప్రతినిధి బృందం 21గంటలపాటు చర్చలు జరిపిందని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది. ఒప్పందం చేసుకునేందుకు.. ఇరాన్ ప్రతినిధులు అన్నిరకాలుగా చొరవ తీసుకున్నట్టు తెలిపింది. కానీ, యూఎస్ అర్థంలేని డిమాండ్లు చర్చల విఫలానికి కారణమయ్యాయని ఆరోపించింది. యుద్ధంతో సాధించలేని వాటిని అమెరికా చర్చల్లో ప్రతిపాదించిందని ఘనాలోని ఇరాన్ రాయబార కార్యాలయం పేర్కొంది. తాము వాటన్నింటినీ గట్టిగా తిరస్కరించినట్టు తెలిపింది. హర్మూజ్ జలసంధి మూసే ఉంటుందని స్పష్టం చేసింది. దీంతో చేసేది లేక.. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వట్టి చేతులతో వెళ్లిపోయారని వ్యాఖ్యానించింది. పరువు నిలుపుకోవడానికి వారికి మరో మార్గం ఏదీ మిగల్లేదని ఎద్దేవా చేసింది. ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. కానీ, రెండు కీలక విషయాలాపై విభేదాలు రావడంతో ఒప్పందం కుదరలేదన్నారు. ఆ రెండు విషయాలు ఏంటనేది ఆయన స్పష్టం చేయలేదు. అయితే, హర్మూజ్ జలసంధి, ఇరాన్ అణుహక్కులపై నెలకొన్న ప్రతిష్ఠంభన కారణంగానే ఇవి విఫలమైనట్లు ఆ దేశ మీడియా పేర్కొంది.

### అప్పుడు బెదిరించి.. ఇప్పుడు భయపడుతోంది

ఇరాన్-అమెరికా మధ్య చర్చలు విఫలమవడంపై



ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పందించారు. ఇరాన్‌లోని అణు, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలను అణచివేయడానికి చేస్తున్న పోరాటంలో తాము విజయం సాధించామన్నారు. గాజాలోని హమాస్, లెబనాన్‌లోని హిజ్బుల్లా, సిరియాలోని అసద్ ప్రభుత్వం, ఇరాక్‌లోని సాయుధ ముఠాలు, యెమెన్‌లోని హూతీల రూపంలో ఇరాన్ తమను ఉక్కిరిబిక్కిరి చేసేందుకు ప్రయత్నించిందని పేర్కొన్నారు. కానీ అమెరికా-ఇజ్రాయెల్ దళాలు ఏకమై ఇరాన్ సేనలకు ఊపిరి ఆడకుండా చేస్తున్నాయన్నారు. ఇజ్రాయెల్‌ను సర్వనాశనం చేస్తామని నాడు బెదిరించిన ఇరాన్ పాలకులు నేడు భయంతో మనుగడ కోసం పోరాడుతున్నారన్నారు. ఈ యుద్ధంలో తాము ఇప్పటికే చారిత్రాత్మక విజయాలు సాధించినప్పటికీ.. ఈ పోరాటం ఇంకా ముగిసిపోలేదని నెతన్యాహు అన్నారు. భవిష్యత్తులో ఆ దేశంపై మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందన్నారు. ఇరాన్ నిర్వహిస్తోన్న అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిర్మూలించి.. ఇంకెప్పుడూ అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. మరోవైపు పాకిస్థాన్‌లో అమెరికాతో చర్చలు విఫలమైనప్పటికీ.. భవిష్యత్తులో అగ్రరాజ్యంతో మళ్లీ చర్చలు జరపడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. ఒకే భేటీలో ఒప్పందం కుదురుతుందని ఎవరూ ఊహించలేదన్నారు.

# చమురు మంటలు తప్పవా?

### విఫలమైన అమెరికా-ఇరాన్ చర్చలు

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు విఫలమయ్యాయి. 21 గంటలపాటు జరిగిన చర్చల్లో ఇరుదేశాల మధ్య ఎలాంటి ఒప్పందం కుదరలేదు. దీంతో రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న ఆందోళనలు నెలకొన్నాయి. పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ జ్వాలలు తప్పవా..! ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తప్పదా..! నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయా..! అమెరికా- ఇరాన్ మధ్య చర్చల విఫలం ఎలాంటి పరిణామాలకు దారి తీయనుంది..

**యుద్ధ జ్వాలలు మళ్లీ రగులుతాయా..!**

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు విఫలమైన నేపథ్యంలో ప్రస్తుతం కుదిరిన రెండువారాల తాత్కాలిక విరమణ ఒప్పందం ముగిసిపోయే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీంతో ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉంది. ఇరాన్‌లోని చమురు కేంద్రాలతోపాటు.. పౌర మౌలిక సదుపాయాలపైనా దాడులకు అవకాశం ఉంది. ఒప్పందం కుదరకపోతే భీకర దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై భయాందోళనలు నెలకొన్నాయి.

**ఇరాన్ ప్రతిఘటన..**

అమెరికా-ఇరాన్ దాడులకు ఇరాన్ కూడా అంతే గట్టిగా ప్రతిఘటిస్తుంది. ఇజ్రాయెల్‌తోపాటు పశ్చిమాసియాలోని చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకోవచ్చు. అదే జరిగితే.. సౌదీ, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ తదితర దేశాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇరాన్ దాడుల్లో పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలకు కూడా ముప్పు పొంచి ఉంది. ఈ యుద్ధం లెబనాన్, సిరియాలకు కూడా విస్తరించే అవకాశం లేకపోలేదు. టెహ్రాన్‌కు మద్దతుగా



హూతీలు, హిజ్బుల్లాలు తమ కార్యకలాపాలను తీవ్రతరం చేస్తాయి.

**ఆర్థిక సంక్షోభం**

హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టుబిగిస్తుంది. దీన్ని శాశ్వతంగా మూసివేస్తుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదముంది. పెట్రోల్, డీజిల్ ధరలు ఊహించని స్థాయికి చేరుకోవచ్చు. అనేక దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. ఈ పరిణామాలు ఆర్థిక మాంద్యానికి కారణం కావొచ్చు.

**అణు భయం..**

ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయొచ్చు. ఇప్పటివరకు పౌర అవసరాల కోసం మాత్రమే యురేనియంను శుద్ధి చేస్తున్నట్టు ఆ దేశం చెప్పుకొచ్చింది. తాజా పరిణామాలతో అణుబాంబు తయారీ దిశగా అది అడుగులు వేయొచ్చు.

**భారత్‌పై ప్రభావం ఉంటుందా?**

పశ్చిమాసియా యుద్ధం మరింత విస్తరిస్తే.. అది భారత్‌కూ ఇబ్బందే. మన దేశ ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. చమురు, సహజవాయువు సరఫరాలకు అంతరాయం కలిగితే.. దేశ ఆర్థిక వ్యవస్థపై అది తీవ్ర ప్రభావం పడే అవకాశముంది.

## ఇరాన్‌కు ఆయుధాలిస్తే జాగ్రత్త: ట్రంప్




యుద్ధ సమయంలో ఇరాన్‌కు చైనా ఆయుధాలు సరఫరా చేస్తున్నట్టు వెలువడిన నివేదికలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. టెహ్రాన్‌కు ఆయుధాలు పంపితే బీజింగ్ తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అటువంటి చర్యలను ఇకనైనా మానుకోవాలని సూచించారు. చమురు నౌకల ప్రయాణానికి హర్మూజ్ను తిరిగి తెరవడానికి వీలుగా సీమైన్స్ తొలగించడానికి తమ దళాలు కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. ఇరాన్‌తో చర్చలు విఫలమైనప్పటికీ అంతిమ విజయం తమదేనని పేర్కొన్నారు. ఆ దేశాన్ని సైనిక పరంగా ఓడించామన్నారు. యుద్ధం విషయంలో నాటో వైపునుంచి అమెరికాకు ఎటువంటి సాయం లభించలేదన్నారు.

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరుగుతున్న సమయంలోనే.. ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో దెబ్బతిన్న తమ రక్షణ సామర్థ్యాలను వేగంగా పునర్నిర్మించుకోవడానికి టెహ్రాన్ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో చైనా.. ఇరాన్‌కు భారీగా ఆయుధాలు సరఫరా చేస్తున్నట్టు అమెరికా నిఘావర్గాలు గుర్తించాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. భుజంమీద పెట్టుకొని ప్రయోగించే షార్ట్ రేంజ్ మిసైల్ లాంచర్లను, ఇతర క్షిపణి వ్యవస్థలను టెహ్రాన్‌కు సరఫరా చేయడానికి బీజింగ్ ప్రణాళిక రచిస్తున్నట్టు తెలిపాయి.

అమెరికా విమానాలు, డ్రోన్లను కూల్చడానికి ఇరాన్ వీటిని ఉపయోగిస్తోంది. వారం రోజుల్లో ఇవి టెహ్రాన్‌కు చేరే అవకాశం ఉందన్నాయి. తన పేరు బయటకురాకుండా ఉండేందుకు చైనా ఈ ఆయుధాలను ఇతర దేశాల మీదుగా తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వార్తలను వాషింగ్టన్లోని చైనా రాయబార కార్యాలయం ఖండించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఏ పక్షానికీ ఎటువంటి ఆయుధాలు సరఫరా చేయలేదని పేర్కొంది. అయితే చైనా నుంచి ఆయుధాలు అందినట్లు ఇరాన్ బహిరంగంగా వెల్లడించనప్పటికీ.. తాము అమెరికా విమానాలను విజయవంతంగా కూల్చడానికి అధునాతన రక్షణ వ్యవస్థలే కారణమని ఐఆర్జీసీ వెల్లడించింది.

# బట్లర్, శుభమన్‌గిల్ అర్ధశతకాలు




## గుజరాత్ టైటాన్స్ ఘన విజయం

ఐపీఎల్ 2026లో భాగంగా లఖ్‌నవూలోని అటల్ బిహారి వాజ్‌పేయి క్రికెట్ స్టేడియం వేదికగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ జట్టు ప్రసిద్ధ్ కృష్ణ 4 వికెట్లతో చెలరేగటంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 164 పరుగులే చేసింది. గుజరాత్‌కు 165 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. జీటీ బౌలర్ల ధాటికి ఎల్ఎస్‌జీ బ్యాటర్లు ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయారు. అందరూ స్వల్ప వ్యవధిలోనే పెవిలియన్ చేరారు. ఓపెనర్ ఐడెన్ మార్క్‌రమ్(30) టాప్ స్కోరర్. గత మ్యాచ్‌లో సంచలనం సృష్టించి న ముకుల్ చౌదరి(18).. ఈ మ్యాచ్‌లో తీవ్రంగా విఫలమయ్యా డు. మిచెల్ మార్ష్(11), రిషబ్ పంత్(18), ఆయుష్ బదోని(9), నికోలస్ పూరన్(19), అబ్దుల్ సమద్(18), జార్జ్ లిండే(16) పరుగులకు ఔటయ్యారు. షమీ(12), ఆవేశ్ ఖాన్(4) నాటౌట్‌గా నిలిచారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 4, అశోక్ శర్మ 2, సిరాజ్ 1, రబాడా 1 వికెట్ తీశారు. అనంతరం 165 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ శుభమన్‌గిల్, జోష్ బట్లర్ అర్ధసెంచరీలతో చెలరేగటంతో సులభంగా విజయం సాధించింది.




## కేకేఆర్ జట్టులోకి రూ.18 కోట్ల స్టార్ ప్లేయర్



ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఇంకా గెలుపు ఖాతా తెరవలేదు. తీవ్ర కష్టాల్లో ఉన్న కేకేఆర్‌కు ఊరట కలిగించే వార్త వచ్చింది. శ్రీలంక స్టార్ పేసర్ మతీశా పతిరణ జట్టుతో చేరేందుకు సిద్ధమయ్యాడు. గాయాలబారిన పడి ఇప్పటివరకు ఐపీఎల్‌కు దూరంగా ఉన్న పతిరణ.. ఏప్రిల్ 17న కేకేఆర్ క్యాంప్‌లో చేరనున్నాడు. గాయాల నుంచి పూర్తిగా కోలుకుని ఫిట్‌నెస్ టెస్టు కూడా క్లియర్ చేశాడు. దీంతో శ్రీలంక క్రికెట్ బోర్డు పతిరణకు అధికారిక ఎన్‌ఓసీ జారీ చేసింది. కాగా ఏప్రిల్ 19న రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌లో పతిరణ అందుబాటులోకి రానున్నాడు. ఐపీఎల్ 2026 వేలంలో పతిరణను కేకేఆర్ రూ.18 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026 సమయంలో అతడు కాలి మడమ గాయం బారిన పడి కీలక మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. అయితే ఏప్రిల్ 6న అతడికి తొలిసారి ఫిట్‌నెస్ టెస్ట్ జరిగింది. గాయం తీవ్రత తగ్గకపోవడంతో పతిరణ ఆ టెస్టుకు హాజరు కాలేకపోయాడు. తాజాగా ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్ సాధించడంతో శ్రీలంక క్రికెట్ ఎన్‌ఓసీ జారీ చేసింది. వరుస ఓటములతో కష్టాల్లో ఉన్న కేకేఆర్‌కు పతిరణ జట్టులో చేరడం పెద్ద ఊరటనిచ్చే అంశమే!

**కేకేఆర్‌కు అసలేమైంది..**

మూడుసార్లు ఐపీఎల్ ఛాంపియన్ అయిన కేకేఆర్.. ఈ సీజన్‌లో మాత్రం నిరాశపరుస్తూ వస్తోంది. ఈ సీజన్‌లోనే అత్యధిక ధర పెట్టి ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌ను కేకేఆర్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అతడిపై ఏకంగా రూ.25.20 కోట్లు పెట్టారు. కానీ గ్రీన్ మాత్రం ఫామ్ లేమితో సతమతమవుతున్నాడు. రూ.18కోట్లు పెట్టి కొనుగోలు చేసిన పతిరణ.. గాయం బారిన పడి ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ ఆడలేదు. ఇదిలా ఉంటే.. ఓ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. మొత్తంగా ఒకే ఒక పాయింట్‌తో పాయింట్ల పట్టికలో కేకేఆర్ ఆఖరి స్థానంలో ఉంది. పతిరణ రాకతో జట్టు విజయాల బాట పడుతుందేమో చూడాలి.

## ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్..

# ఆయుష్ ఓటమి.. భారత్‌కు రజతం



ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్ స్వర్ణం గెలిచే అవకాశాన్ని త్రుటిలో కోల్పోయాడు. ఈ టోర్నీలో తన అద్భుత ప్రయాణాన్ని రజతంతో ముగించాడు. పెద్దగా అంచనాల్లేకుండా టోర్నీలో అడుగుపెట్టి సంచలన విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లిన ఆయుష్.. టైటిల్ పోరులో తడబడ్డాడు. రెండో సీడ్ షియుకి(చైనా)తో జరిగిన ఫైనల్‌లో ఆయుష్ ఓటమిని చవిచూశాడు. 42 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో ఆయుష్ 8-21, 10-21 తేడాతో వరుస గేముల్లో ఓడిపోయి రజతంతో సరిపెట్టుకున్నాడు. ప్రస్తుతం ప్రపంచ నంబర్ 2గా ఉన్న షియుకి ఈ మ్యాచ్‌లో ఎలాంటి తప్పిదాలు చేయకుండా అద్భుతమైన విజయం అందుకుని ఆసియా ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాడు. 20 ఏళ్ల ఆయుష్ శెట్టి ఈ టోర్నీలో అసాధారణ ప్రదర్శనే కనబర్చాడు. ఫైనల్ చేరే క్రమంలో ప్రపంచ నంబర్ వన్ షట్లర్ కున్లావత్ వితిద్సన్‌తో పాటు, వరల్డ్ నంబర్ 4, వరల్డ్ నంబర్ 7లను కూడా ఓడించి ఫైనల్‌కు దూసుకొచ్చాడు. ఫైనల్ పోరులో మాత్రం చైనా షట్లర్ ధాటికి నిలవలేక రజతంతో సరిపెట్టుకున్నాడు. ఈ టోర్నీలో 61 ఏళ్ల క్రితం భారత్‌కు స్వర్ణం వచ్చింది. ఈసారైనా ఆయుష్ అద్భుత ప్రదర్శనతో దేశానికి గోల్డ్ వస్తుందని భావించారంతా. కానీ అనూహ్య ఓటమితో పురుషుల సింగిల్స్‌లో ఈ నిరీక్షణ ఇంకా కొనసాగనుంది. ఇప్పటివరకు ఈ టైటిల్ గెలిచిన ఏకైక భారత ఆటగాడు దినేశ్ ఖన్నా(1965) కావడం విశేషం.

# కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు సెంచరీ అంకితం



ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ ఎట్టకేలకు గెలుపు ఖాతా తెరిచింది. శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. గత మూడు మ్యాచుల్లో విఫలమవుతూ వస్తోన్న స్టార్ బ్యాటర్ సంజు శాంసన్ (115) సెంచరీతో చెలరేగి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. కీలక సమయంలో జట్టుకు విజయాన్ని అందించిన సంజు.. తన సెంచరీపై మాట్లాడాడు. తనపై నమ్మకం ఉంచి అవకాశాలిచ్చిన ఫ్రాంచైజీకి ధన్యవాదాలు తెలిపాడు. తన సెంచరీని సీఎస్కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు అంకితం చేస్తున్నట్లు వెల్లడించాడు. 'ఫ్రాంచైజీ నాపై నమ్మకం ఉంచి భారీ మొత్తం వెచ్చించి మరీ జట్టులోకి తీసుకుంది. మెరుగైన ఆటతీరు ప్రదర్శించాల్సిన బాధ్యత నాపై ఉంది. గత మూడు మ్యాచుల్లోనూ విఫలమైనా సరే.. ఒక్క మాట కూడా అనలేదు. ఇప్పుడు సెంచరీతో ఆ భారం కాస్త దిగింది. మేం కూడా టోర్నీ రేసులో ఉన్నామని బలంగా చెప్పగల ను. కొత్త ఫ్రాంచైజీ తరఫున ఆడుతూ.. మంచి ఆరంభం లేకపోతే తిరిగి పుంజుకోవడం చాలా కష్టం. కానీ మేనేజ్‌మెంట్ పూర్తి మద్దతు ఇచ్చింది. నాకు చెన్నై మరో హోమ్ లాంటిది. మొదట్లో విఫలమైనా.. దాని నుంచి తేరుకుని కమ్‌బ్యాక్ ఇవ్వడం ఆనందం గా ఉంది. అందుకోసం చాలా శ్రమించా. నా గేమ్ ప్లాన్ మార్చుకు న్నా. ఇప్పుడు నా వయసు 31 ఏళ్లు. చాలాకాలం ఆటతో మమేకం కావాల్సి ఉంటుంది. కాబట్టి నా బలం ఏంటో గుర్తించి.. మానసికంగానూ మెరుగయ్యేందుకు శ్రమించా' అని సంజు తెలిపాడు. 'సీఎస్కే తరఫున తొలి సెంచరీని నమోదు చేయడం ఆనందంగా ఉంది. అయితే దీనిని ఓ వ్యక్తికి అంకితం చేస్తున్నా. నేను విఫలమైనా సరే.. వెన్నంటే ఉంటూ ప్రోత్సహించిన ప్రధాన కోచ్ ఫ్లెమింగ్‌కే నా సెంచరీని డెడికేట్ చేస్తున్నా. నేను కూడా ఓ జట్టును ఐదేళ్లపాటు నడిపించా. ఆ కష్టం నాకూ తెలు సు. మానసికంగా చాలా సవాళ్లు ఉంటాయి. ఓడిపోయిన ప్రతిసారీ బయట నుంచి వచ్చే ఒత్తిడిని ఎదుర్కోవడం కష్టం. అందుకే ఈ సెంచరీని మా కోచ్‌కు అంకితం చేస్తున్నా' అని సంజు వెల్లడించాడు.

# ఆ విషయంలో ముంబై ఇండియన్స్ తుస్: అశ్విన్



ఐపీఎల్ 2026లో భాగంగా ఇవాళ మరో కీలక పోరు జరగనుంది. మరికాసేపట్లో ముంబై ఇండియన్స్, రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ముంబై జట్టు కేవలం రోహిత్ శర్మపైనే ఆధారపడిందని అనుకోవడం చాలా పొరపాటని తెలిపాడు. అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ ముంబై బ్యాటింగ్ లైనప్ చాలా పటిష్ఠంగా ఉందని, ఆ జట్టుకు రోహిత్ ఒక్కడే దిక్కు కాదని వెల్లడించాడు. అశ్విన్ ముంబై జట్టు బ్యాటింగ్ గురించి మాట్లాడుతూనే ఆ జట్టు ఎదుర్కొంటున్న అసలు సవాళ్లను ప్రస్తావించాడు. ఈ సీజన్లో ముంబై జట్టును బౌలింగ్ విభాగం దెబ్బతీస్తోందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా స్పిన్ విభాగం ఆశించిన స్థాయిలో రాణించడం లేదని, స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు మిగిలిన బౌలర్ల నుంచి తగిన సహకారం లభించడం లేదని పేర్కొన్నాడు. ఓపెనింగ్ బౌలర్లు కూడా ధారాళంగా పరుగులు ఇస్తుండటం హార్దిక్ సేనకు తలనొప్పిగా మారిందని అశ్విన్ విశ్లేషించాడు. అలానే ముంబై, బెంగళూరు జట్ల మధ్య పోటీ అంటేనే అది రోహిత్ శర్మ వర్సెస్ విరాట్ కోహ్లీగా మారుతుందని, వాంఖడే స్టేడియంలో మరో భారీ స్కోర్ల మ్యాచ్ ఖాయమని అతడు జోస్యం చెప్పాడు. మొత్తంగా అశ్విన్ చేసిన ఈ కామెంట్స్ మ్యాచ్‌కు ముందు ఇరు జట్ల అభిమానుల్లో కాక రేపుతున్నాయి.

చైతన్య రథం
సినిమా
సోమవారం 13 ఏప్రిల్ 2026 X



# ‘ఓజీ-2’లో భారీ మార్పులేనా?

పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన సినిమాల్లో తన వింటేజ్ సినిమాల సమయంలో ఏరకమైన హైప్ ఉండేదో ఆ తరహా హైప్‌లో వచ్చిన ఏకైక సినిమానే ఓజీ. యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన ఈ గ్యాంగ్స్టర్ డ్రామా మిక్స్ టాక్‌తో కూడా 300కోట్లు గ్రాస్‌కి పైగా రాబట్టింది. అయితే ఈ సినిమా సీక్వెల్‌ని పవన్ కూడా కన్ఫర్మ్ చేయడంతో ఈ సినిమా కూడా మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ఇదిలా ఉండగా పార్ట్-2 విషయంలో ఓ ఇంట్రెస్టింగ్ బజ్ ఇప్పుడు వినిపిస్తోంది. దీని ప్రకారం ఓజి పార్ట్ 1 నిర్మాణ సంస్థ డివివి ఎంటర్టైన్మెంట్స్ పార్ట్-2కి ఉండబోతోందని తెలుస్తోంది. పార్ట్ 2 కంప్లీట్‌గా పవన్ ఇంకా టీజీ విశ్వ ప్రసాద్‌ల కలయికలో నిర్మాణం పూర్తి అవుతుంది అని లేటెస్ట్ టాక్. సో ఇక సుజీత్‌కి మరింత ఫ్రీ హ్యాండ్ వుంటుందని చెప్పవచ్చు. ఈ సినిమా మొదలు కావడానికి మరికొంత సమయం పడుతుందన్న టాక్ లేకపోలేదు.

# ఆ డైరెక్టర్‌కి టవల్ వేస్తున్నాడట



తిరువీర్ హీరోగా ఎస్పీ దుర్గ నరేష్ దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ ‘పాపం ప్రతాప్’. కృషి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రాకేశ్‌రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మదిరెడ్డి సంయుక్తంగా సినిమాని నిర్మించారు. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్‌నుంచి రాబోతున్న ఈ సినిమా.. ఏప్రిల్ 17న థియేటర్లలో రిలీజ్ కాబోతుంది. అయితే, ఈ సినిమా ట్రైలర్‌లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన హీరో అల్లరి నరేష్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అల్లరి నరేష్ మాట్లాడుతూ.. “నేను ఈ ఫంక్షన్‌కు రావడానికి కారణం తిరువీర్. నా వైఫ్ ఆయనకు పెద్ద ఫ్యాన్. ‘మసూద’ సినిమానుంచే తను తిరువీర్‌కి ఫ్యాన్ అయింది. మా ఇంట్లో ఎప్పుడూ వినబడే డైలాగ్ ‘సమోసా తింటావా శిరీషా’. మేము ఇంట్లో సరదాగా ఆ డైలాగ్‌తో మాట్లాడుకుంటాం. ఇక ఈ సినిమా దర్శకుడు ఎస్పీ దుర్గ నరేష్‌తో సినిమా చేస్తాను. ఆయనకు ఖర్చీఫ్ కాదు, ఏకంగా టవల్ కూడా వేస్తున్నాను’ అని నరేష్ సరదాగా వ్యాఖ్యానించారు.

# కనకరాజు కోసం భారీ సెట్




వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ‘కొరియన్ కనకరాజు’ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో వరుణ్ తేజ్ సరసన యంగ్ బ్యూటీ రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే, ఈ సినిమా కొత్త షెడ్యూల్ కోసం ఓ స్పెషల్ సెట్ వేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సెట్‌లో వరుణ్ తేజ్‌పై ఎంట్రీ సాంగ్‌ను షూట్ చేస్తారట. ఈ సాంగ్‌లో వరుణ్ తేజ్‌తోపాటు రితికా నాయక్ కూడా కనిపిస్తోందని తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో వరుణ్ తేజ్ కనకరాజు పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఆ మధ్య విడుదలైన గ్లింప్స్‌లో వరుణ్ తేజ్ ‘నేను తిరిగొచ్చేశా’ అంటూ కొరియన్ భాషలో చెప్పడం ఆకట్టుకుంది. ఇంతకీ, ఈ సినిమాకి కొరియన్ భాషకు ఏమిటి సంబంధం అనేది? సినిమాలో చాలా ఆసక్తిగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది. మరి ఈ సినిమా ఏ రేంజ్ విజయాన్ని సాధిస్తోందో చూడాలి.



# లీక్ వార్తలు నిరాధారం

దళపతి విజయ్ నటించిన జన నాయగన్ సినిమా రిలీజ్‌కు ముందే ఆన్‌లైన్‌లో లీకైందన్న వార్తలు సినీ ఇండస్ట్రీలో తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేయగా.. తాజాగా సీబీఎఫ్‌సీ అధికారికంగా స్పందిస్తూ కీలక ప్రకటన విడుదల చేసింది. సెన్సార్ బోర్డు ప్రకారం.. ‘జన నాయగన్’ మూవీ లీకైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. తమ వద్ద ఉన్న భద్రతా వ్యవస్థలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని తెలిపింది. ముఖ్యంగా సినిమా కంటెంట్‌ను రక్షించేందుకు కీ డెలివరీ మెసేజ్ సిస్టమ్‌ను ఉపయోగిస్తున్నామని వివరించింది. ఈ విధానం ద్వారా సినిమా కాపీకి యాక్సెస్ పూర్తిగా పాస్‌వర్డ్ ఆధారంగా ఉండటంతో అనధికారికంగా లీక్ అయ్యే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని పేర్కొంది. అలాగే, సినిమా డిజిటల్ సినిమా ప్యాకేజీ మార్చి 17న ముంబైలో అధికారికంగా నిర్మాతకు అందజేసినట్టు వెల్లడించింది. తరువాతనుంచి ఆ కంటెంట్ పూర్తిగా నిర్మాత ఆధీనంలోనే ఉందని సీబీఎఫ్‌సీ స్పష్టం చేసింది. మరోవైపు, సినిమా లీక్ అంశంపై చిత్ర నిర్మాణ సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ కొనసాగుతోంది. సోషల్ మీడియాలో లింకులు షేర్ చేసిన ఐదుగురిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసినట్టు సమాచారం. వైరల్ అవుతున్న వీడియోల్లో కనిపించిన వాటర్‌మార్క్ ఆధారంగా లీక్ ఎక్కడి నుంచి జరిగిందనే దానిపై దర్యాప్తు జరుగుతోంది.

# ‘రాకాస’ సీక్వెల్‌పై క్లారిటీ



చిన్న సినిమాగా విడుదలైన ‘రాకాస’ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. హారర్ కామెడీ థ్రిల్లర్‌గా వచ్చిన చిత్రం ప్రేక్షకులను విపరీతంగా అలరించడంతో పాటు కలెక్షన్ల పరంగానూ సత్తా చాటింది. ఈ విజయంతో ‘రాకాస-2’పై ఆసక్తికర చర్చలు మొదలయ్యాయి. రీసెంట్‌గా జరిగిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో దర్శకురాలు మానస శర్మ సీక్వెల్‌పై క్లారిటీ ఇచ్చారు. “రాకాస-2 కచ్చితంగా ఉంటుంది. స్టోరీ స్ట్రక్చర్ సిద్ధంగా ఉంది. కానీ ఇంకా దాన్ని మరింత డెవలప్ చేయాలి” అని ఆమె తెలిపారు. ఈ వ్యాఖ్యలతో సీక్వెల్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. మొదటి భాగంలో హీరోగా నటించిన సంగీత్ శోభన్ ‘రాకాస-2’లో కూడా కొనసాగుతాడా? అనే ప్రశ్నకు మానస శర్మ ఆసక్తికర సమాధానమిచ్చారు. “అది కాలమే నిర్ణయిస్తుంది” అంటూ క్లియర్‌గా చెప్పకుండా తప్పించుకోవడంతో, ఈ విషయంపై మరింత సస్పెన్స్ నెలకొంది. ఆమె సమాధానం విని పక్కనే ఉన్న నిర్మాత నిహారిక కొణిదెల, హీరో సంగీత్ శోభన్ కూడా ఆశ్చర్యపోయారు. చందమామ కథ తరహాలో ఉన్న ఒక ఫాంటసీ అంశాన్ని నేటి తరానికి తగ్గట్లుగా హారర్, కామెడీ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి మానస శర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక హీరో హీరోయిన్లుగా నటించారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, జీ స్టూడియోస్ బ్యానర్లపై ఈ సినిమా నిర్మితమైంది. ఓ గ్రామంలో ఉన్న కోటలో బ్రహ్మరాక్షసుడు నివసిస్తాడు. అతను బలి కోరినప్పుడల్లా గ్రామంనుంచి ఒకరిని పంపాలి. ఒక సందర్భంలో హీరో తన స్నేహితుడి కోసం కోటలోకి వెళ్లడం, అక్కడ జరిగే సంఘటనలు కథలో ప్రధానాంశం. హారర్, కామెడీ మేళవింపుతో ఈ కథ ప్రేక్షకులను కట్టిపడేసింది. ‘రాకాస’ సక్సెస్‌తో ‘రాకాస-2’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కథను ఇంకా బలోపేతం చేసి, మరింత గ్రాండియర్‌గా సీక్వెల్‌ను తెరకెక్కించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# ఆ పరిస్థితి తనూ ఫేస్ చేసిందట

సినీ పరిశ్రమల్లో ఆ మధ్య సంచలనంగా మారిన ‘మీటూ’ ఉద్యమం ఇంకా రసవత్తరంగానే సాగుతుంది. తాజాగా సినీ పరిశ్రమలో కమిట్‌మెంట్‌ల పేరుతో ఎదురయ్యే సమస్యలు బహిరంగ రహస్యమేనని నటి వితిక షేరు రీసెంట్‌గా చేసిన కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ‘నేను 16 ఏళ్ల వయసులో ఎదుర్కొన్న ఒక చేదు అనుభవాన్ని ఇప్పటికీ మర్చిపోలేను. దాదాపు 14 ఏళ్ల క్రితం, నాకు 16 ఏళ్లు ఉన్నప్పుడు, హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో జరిగిన ఒక ఆడిషన్‌కు మా అమ్మతో కలిసి వెళ్లాను’ అని తెలిపారు. వితిక ఇంకా మాట్లాడుతూ.. ‘ఆడిషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయి, పాత్రకు నన్ను ఎంపిక చేశారు. కానీ ఆ తర్వాత, “కమిట్‌మెంట్” గురించి అడిగారు. ఆ సమయంలో నన్ను బయటకు పంపి.. మా అమ్మతో కమిట్‌మెంట్ గురించి మాట్లాడారు. కమిట్‌మెంట్ గురించి అడిగిన వ్యక్తితో, తాము అలాంటి వాటికి ఆసక్తి చూపబోమని స్పష్టం చేశాము. ఆ తర్వాత కూడా నేను చాలా సినిమాలు వదులుకున్నాను’ అన్నారు వితిక.